www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

శనివారం 2 - 8 - 2025 | సంపుటి : 1 | సంచిక : 28 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## 'భగవంత్ కేసరి'కి జాతీయ అవార్డు

**ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక**
**జాతీయ చలన చిత్ర అవార్డులు ప్రకటన**
**ఉత్తమ నటుడు షారుక్..**

ఉత్తమ చిత్రం 12th ఫెయిల్






2లో...

# తేల్చుకుందాం..కదలిరండి..

- స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా తేల్చాల్సిందే
- వైశ్యులపట్ల రాజకీయ వివక్షను జీర్ణించుకోలేకపోతున్నా
- వైశ్యుల హక్కుల సాధన కోసం ముందుండి పోరాడతా
- మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు అడుగుజాడల్లో ముందుకెళ్తా
- అన్ని వైశ్య సంఘాలు నాతో కలిసిరావాలి
- తెలంగాణ వ్యాప్తంగా వైశ్య సమాజం రణభేరికి తరలిరావాలి
- వైశ్య రాజకీయ రణభేరి సభను విజయవంతం చేయాలి
- వైశ్య వికాస వేదిక ఛైర్మన్ డా.కాచం సత్యనారాయణ గుప్త..

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** ఆగస్టు 3న వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో తలపెట్టిన వైశ్య రాజకీయ రణభేరి సభకు తెలంగాణలోని ఆర్యవైశ్య సమాజం కదలివచ్చి విజయవంతం చేయాలని వైశ్యవికాస వేదిక ఛైర్మన్ డా.కాచం సత్యనారాయణ గుప్త పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దాదాపు మూడు దశాబ్ధాలకుపైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ,ప్రస్తుత తెలంగాణలో రాజకీయంగా వైశ్యుల విషయంలో ఆయా రాజకీయ పార్టీలు వివక్ష కొనసాగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు కేవలం ఆర్యవైశ్యుల ఓటు బ్యాంకు ను మాత్రమే వాడుకొని పబ్బం గడిపారన్నారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యులకు వాటా కల్పించాలి. ఈడబ్ల్యుఎస్ లో వర్గీకరణ తేవాలి. వైశ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. కులగణన నివేదికలోని అగ్రవర్ణాల వివరాలు కులాల వారీగా ప్రకటించాలి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యం కల్పించాలి. స్కిల్ యూనివర్సిటీలో వైశ్యులకు 25శాతం సీట్లు కేటాయించాలి. విదేశీ విద్యా సహాయ నిధిని ఏర్పాటు చేసి వైశ్య విద్యార్థులకు తోడ్పాడు అందించాలి.

వైశ్య బంధు ప్రారంభించాలి అనే డిమాండ్లతో వైశ్య రాజకీయ రణభేరిని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తలపెట్టామన్నారు. బీఆర్ ఎస్ ప్రభుత్వంలో ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీతో పాటు 7 కార్పోరేషన్లు, 11 మున్సిపాలిటీల ఛైర్మన్ పదవులు మాత్రమే ఇచ్చారు. బిజెపి ప్రభుత్వం ఒక్కరికే ఎమ్మెల్యే అవకాశం కల్పించారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైశ్యులకు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. గడిచిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు కూడా కేవలం ముఖ్యమంత్రులకు తొత్తులు గామారి ఆర్యవైశ్యుల సమస్యలను ఏనాడు పట్టించుకోలేదన్నారు. తాను తెలంగాణ ఉద్యమకారుడిని రాష్ట్రంలో అందరికీ సుపరిచితుడినని నాడు కేసీఆర్ పిలుపునందుకు తెలంగాణ మలిదశ ఉద్యమం ప్రారంభం నుంచి తెలంగాణ సాధించేవరకు మొక్కవోని ఆత్మవిశ్వాసంతో, నిబద్ధతతో ఎల్‌బీనగర్ కేంద్రంగా తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించానన్నారు. అదే నిబద్ధతతో, అదే ఆత్మవిశ్వాసంతో ఇప్పుడు తెలంగాణ వైశ్యుల హక్కుల సాధన కోసం ముందుండి పోరాడతానన్నారు. సాధించే వరకు నిద్రపోనన్నారు. నాతో కలిసివస్తే అన్ని సంఘాలను కలుపుకుపోతానన్నారు. ఇక నుంచి నాపోరాటమంతా వైశ్యులకోసమేనన్నారు. భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో శాంతి ఉద్యమాలతో భరతజాతికి నడిపించిన మహాత్మాగాంధీ, మద్రాసు రాష్ట్రంలో వివక్షకు గురైన తెలుగువారి ప్రత్యేక రాష్ట్రం కోసం అమరణ నిరాహార దీక్షచేసి అసువులు బాసి ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన పొట్టిశ్రీరాములు అడుగుజాడల్లో నడుస్తూ తెలంగాణలో వైశ్యుల హక్కులను సాధిస్తానని డా.కాచం ధీమా వ్యక్తం చేశారు. సమాజ సేవలో అందరికంటే ముందుండి..



ఆర్థికంగా సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న వైశ్యుల విషయంలో రాజకీయ పార్టీలు ప్రదర్శిస్తున్న వివక్షను జీర్ణించుకోలేకపోతున్నానని అందుకే వైశ్యరాజకీయ రణభేరిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో అనేక పోరాటాలు నిర్వహించనున్నట్లు కాచం సత్యనారాయణ తెలిపారు. వైశ్యులలో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వైశ్య సంఘాలు, వాసవీ క్లబ్‌లు, వికాస వేదికలు లాంటి చాలా సంఘాలు ఉన్నాయని వారందరూ ఈరణభేరికి నాతో కలిసిరావాలని వైశ్యుల హక్కుల సాధనలో భాగస్వాములు కావాలన్నారు.

## తెలంగాణలో ఏసీబీ దూకుడు

**అవినీతి అధికారులపై మెరుపుదాడులు**

**జూలైలోనే 22 కేసులు నమోదు**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో ఏసీబీ అధికారులు దూకుడు పెంచారు. అవినీతి అధికారుల పై మెరుపుదాడులు చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు. ఒక్క జూలై నెలలోనే మొత్తం 22 కేసులు నమోదు చేశారు. అందులో 13 ట్రాప్ కేసులు, 1 అసమాన సంపత్తి, 1 క్రిమినల్ మిస్కండక్ట్ కేసు నమోదయ్యాయి. ట్రాప్ కేసుల్లో రూ. 5.75 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అసమాన ఆస్తుల కేసులో రూ. 11.5 కోట్ల విలువైన ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. ఆర్టీఏ చెక్ పోస్టులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అకౌంటింగ్ లేని రూ. 1.49 లక్షలనగదు స్వాధీనం చేసుకున్నారు.ఈ ఏడాదిలో జనవరి నుండి జూలై వరకు 148 కేసులు నమోదు చేశారు. మొత్తం 145 మంది ప్రభుత్వ మరియు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అరెస్ట్ చేశారు. ట్రాప్ కేసుల్లో మొత్తం రూ. 30.32 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. జూలైలో21 కేసులకు నివేదికలు పంపారు.

## రాజకీయ వైశ్య రణభేరి విజయవంతం చేద్దాం

**ఆర్యవైశ్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ**



**విశ్వంభర, హైద్రాబాద్:** ఆగస్టు 3వ తేదీన హైదరాబాద్‌నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డా.కాచం సత్యనారా యణ గుప్త ఆధ్వర్యం లో జరిగే వైశ్య రాజకీయ రణభేరి కార్యక్రమం ను విజయవంతం చేద్దాం అని ఆర్యవైశ్య పోరాట సమితి అధ్యక్షుడు ప్రేమ్ గాంధీ పిలుపునిచ్చారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ప్రేమ్ గాంధీ ఆధ్వర్యంలో విలేకరుల సమావ్టే శము నిర్వహి ంచారు. ఈ కార్యక్రమానికి వైశ్య వికాస వేదిక , రాజకీయ వైశ్య రణభేరి అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్త ముఖ్య అతిధిగా హాజరై పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాల్సిందేనని అన్నారు. ఈ డబ్ల్యూఎస్ లో వర్గీకరణ తేవాలని అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా వైశ్యులను గుడి , బడి వద్ద సేవ కార్యక్రమాలకు వాడుకుంటున్నారే తప్ప, రాజకీయంలో సీట్లు కేటాయించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సతీష్ గుప్తా, భాగ్యనగర్ అధ్యక్షులు శంకర్ , మీడియా కన్వీనర్ ఉదయ్ కుమార్ , నాయకులు దొంతు చెన్నకేశవ శెట్టి, నాగరాజు, సంతోష్, విజయ్, రాజ్ కుమార్, చైతన్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంకు చేరిన కాళేశ్వరం కమిషన్ నివేదిక

**అందజేసిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి**
**నివేదికను అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు**



2లో...

## హైకోర్టుకు ఎమ్మెల్సీ కవిత

**నిరాహార దీక్షకు అనుమతివ్వని పోలీసులు..**
**ఎన్ని ఆటంకాలు సృష్టించినా 72 గంటల దీక్ష చేస్తా: కవిత**



**విశ్వంభర, హైదరాబాద్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనలో భాగంగా 72 గంటల నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించిన విషయం తెలిసిందే. ఆమె దీక్షకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో కవిత హైకోర్టును ఆశ్రయించనున్నారు. ప్రభుత్వం అడ్డుకున్నా.. ఎన్ని ఆటంకాలు సృష్టించినా 72 గంటల నిరాహార దీక్ష చేస్తానని కవిత స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు విశ్రమించేది లేదన్నారు.బీసీ బిల్లు సాధన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు దీక్ష చేయనున్నట్టు చెప్పారు. బీసీ బిల్లు సాధన విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే.. అన్ని పార్టీలతో వెంటనే అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు.

## జనవరి 26 నాటికి అందుబాటులోకి 4000 మెగావాట్ల విద్యుత్



- ప్రజాధనం వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం
- నిర్ణీత సమయానికి పవర్ ప్లాంట్ పూర్తయ్యేలా పనులు చేపడుతున్నాం
- ఉద్యోగులు సిబ్బంది కోసం సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ నిర్మాణం
- భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఉద్యోగ అవకాశాలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- వైటీపీఎస్ యూనిట్ 1ను జాతికి అంకితం చేసిన మంత్రులు

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ సెప్టెంబర్ 9న పోలింగ్.. ఫలితాలు



**న్యూఢిల్లీ,ఆగస్టు,01:** భారత దేశ 17వ ఉపరాష్ట్రపతి ఎన్నిక సెప్టెంబర్ 9 న జరగనుంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక కోసం కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఎన్నిక నోటిఫికేషన్ ఆగస్టు 7న విడుదల కానుంది . ఉపరాష్ట్ర పదవికి పోటీ పడే వారు ఆగస్టు 7 నుంచి, ఆగస్టు 21 వరకు నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ మొత్తం పార్లమెంట్లోని వసుధ భవనం ఫస్ట్ ఫ్లోర్‌లో జరగనుంది. సెప్టెంబర్ 9 న, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.. ప్రస్తుతం రాజ్యసభలో 233 మంది ఎన్నికైన సభ్యుల్లో 5 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. లోక్‌సభలో 543 మంది ఎంపీల్లో ఒక స్థానం ఖాళీగా ఉంది. అలాగే 12 మంది నామినేటెడ్ రాజ్యసభ సభ్యులు కలిపి మొత్తం 788 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతానికి 782 మంది ఓటు వేయనున్నారు. ఒక్కో ఎంపీకి ఓటు విలువ 1గా ఉంటుంది. ఉపరాష్ట్రపతి ఎన్నిక సీక్రెట్ బ్యాలెట్ విధానంలో జరుగుతుంది.. అంతేకాదు ఓటర్లు తమ ఓటును ప్రాధాన్యత క్రమంలో వినియోగించుకోవాల్సి ఉంటుంది%౯% ఓటర్లు ఈసీ అందించే ప్రత్యేక పెన్‌తో మాత్రమే బ్యాలెట్ పేపర్‌పై తమ ఎంపికను గుర్తించాలి. అయితే మొదటి ప్రాధాన్యత గుర్తించకపోతే ఓటు చెల్లదు. పార్టీలకు ఈ ఎన్నికలో తమ ఎంపీలకు విప్ జారీ చేసే అధికారం లేదు. రాజ్యసభ కార్యదర్శిని రిటర్నింగ్ ఆఫీసర్‌గా, మరో ఇద్దరిని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే నియమించింది.

ప్రజా విశ్వంభర

# 'భగవంత్ కేసరి'కి జాతీయ అవార్డు

## ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక జాతీయ చలన చిత్ర అవార్డులు ప్రకటన






మొదటిపేజీ తరువాయి...
71వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. జాతీయ ఉత్తమ చిత్రంగా '12th ఫెయిల్'కు అవార్డు దక్కింది. జాతీయ ఉత్తమ నటుడి అవార్డును ఇద్దరు పంచుకున్నారు. షారుక్ ఖాన్ (జవాన్), విక్రాంత్ మస్సే (12th ఫెయిల్)లు ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా 'మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే' (హిందీ)లో నటనకు రాణీ ముఖర్జీని అవార్డు వరించింది. ఉత్తమ దర్శకుడిగా 'ది కేరళ స్టోరీ'ని తెరకెక్కించిన సుదీప్తో సేన్ దక్కించుకున్నారు. ఇక ఉత్తమ తెలుగు చిత్రంగా బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి'ని అవార్డు వరించింది. ఉత్తమ తమిళ చిత్రంగా 'పార్కింగ్'కు అవార్డు దక్కింది. బెస్ట్ ఫిల్మ్ క్రిటిక్ అవార్డు ఉత్పల్ దత్త (అస్సామీ)కు ప్రకటించారు.

జాతీయ చలన చిత్ర అవార్డులు ఫీచర్ ఫిల్మ్

ఉత్తమ ఫీచర్ ఫిల్మ్: 12th ఫెయిల్
ఉత్తమ దర్శకత్వం: ది కేరళ స్టోరీ (హిందీ) సుదీప్తో సేన్
ఉత్తమ నటుడు: జవాన్ (హిందీ) షారుక్ ఖాన్, 12th ఫెయిల్ (హిందీ) విక్రాంత్ మస్సే
ఉత్తమ నటి: మిస్సెస్ ఛటర్జీ వర్సెస్ నార్వే (హిందీ) రాణీ ముఖర్జీ
ఉత్తమ సహాయ నటుడు: పూక్కాలం (మలయాళం) విజయ రాఘవన్‌బీ పార్కింగ్ (తమిళ్) ముత్తుపెట్టాయ్ సోము భాస్కర్
ఉత్తమ సహాయ నటి: ఉళ్ళోలుక్కు (మలయాళం) ఊర్వశిబీ వష్ (గుజరాతీ) జానకీ బోడివాలా
బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్: గాంధీతాత చెట్టు (తెలుగు) సుకృతివేణిబీ జిప్సీ (మరాఠీ) కబీర్ ఖండారీబీ నాల్ 2 (మరాఠీ) త్రిష థోసర్, శ్రీనివాస్ పోకలే, భార్గవ్ జగ్దీప్
ఉత్తమ నేపథ్య గాయకుడు: బేబీ (ప్రేమిస్తున్నా..) పీవీఎన్ ఎస్ రోహిత్
ఉత్తమ నేపథ్య గాయని: జవాన్ (చెలియా) శిల్పారావు
ఉత్తమ సినిమాటోగ్రఫీ: ది కేరళ స్టోరీ (హిందీ) పసంతను మొహపాత్రో
ఉత్తమ సంభాషణలు: సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై (హిందీ) దీపక్ కింగ్రానీ
ఉత్తమ స్క్రీన్‌ప్లే (ఒరిజినల్): పార్కింగ్ (తమిళ్) రామ్‌కుమార్ బాలకృష్ణన్‌బీ బేబీ (తెలుగు) సాయి రాజేశ్ నీలం
ఉత్తమ సౌండ్ డిజైన్: యానిమల్ (హిందీ) సచిన్ సుధాకరన్, హరి హరన్ మురళీ ధరన్
ఉత్తమ ఎడిటింగ్: పూక్కాలమ్ (మలయాళం) మిధున్ మురళి
ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్: 2018 (మలయాళం) మోహన్‌దాస్
ఉత్తమ నృత్య దర్శకత్వం: రాకీ ఔర్ రాణి కి ప్రేమ కహానీ (హిందీ) వైభవ్ మర్చంట్
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్: సామ్ బహదూర్ (హిందీ) సామ్ బహదూర్ (హిందీ) సచిన్ లవ్లేకర్, దివ్య గంభీర్, నిధి గంభీర్
ఉత్తమ మేకప్: సామ్ బహదూర్ (హిందీ) శ్రీకాంత్‌దేశాయ్
ఉత్తమ సంగీతం (నేపథ్యం): యానిమల్ (హిందీ) హర్షవర్ధన్ రామేశ్వర్
ఉత్తమ సంగీత దర్శకత్వంబీ వాతి (తమిళ్) జీవీ ప్రకాశ్ కుమార్
ఉత్తమ ప్రజాదరణ చిత్రం: రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ (హిందీ)
ఉత్తమ జాతీయ సమగ్రత, సామాజిక విలువల చిత్రం: సామ్ బహదూర్ (హిందీ)
ఉత్తమ పరిచయ దర్శకుడు: ఆత్మపాంప్లెట్ (మరాఠీ) ఆశిష్ బెండే
ఉత్తమ బాలల చిత్రం: నాల్ (మరాఠీ)
ఉత్తమ యానిమేషన్ విజువల్ ఎఫెక్ట్స్ మూవీ: హనుమాన్ (తెలుగు)
స్పెషల్ మెన్షన్: రీ–రికార్డింగ్ (యానిమల్) ఎంఆర్ రాజకృష్ణన్
ఉత్తమ ప్రాంతీయ భాషా చిత్రాలు...
ఉత్తమ తెలుగు చిత్రం: భగవంత్ కేసరి
ఉత్తమ తమిళ చిత్రం: పార్కింగ్
ఉత్తమ పంజాబీ చిత్రం:
గాడ్‌డే గాడ్‌డే చా
ఉత్తమ ఒడియా చిత్రం: పుష్కర
ఉత్తమ మరాఠీ చిత్రం: షామ్‌చియాయ్
ఉత్తమ మలయాళీ చిత్రం: ఉళ్ళోలుక్కు
ఉత్తమ కన్నడ చిత్రం: కందీలు –ది రే ఆఫ్ హోప్
ఉత్తమ హిందీ చిత్రం: కథల్: ఏ జాక్ ఫ్రూట్ మిస్టరీ
ఉత్తమ గుజరాతీ చిత్రం: వష్
ఉత్తమ బెంగాలీ చిత్రం: డీప్ ఫ్రిడ్జ్
ఉత్తమ అస్సామీ చిత్రం: రొంగటపు 1982
నాన్ ఫీచర్ ఫిల్మ్స్ కేటగిరి
స్పెషల్ మెన్షన్ చిత్రాలు
నేకల్: క్రానికల్ ఆఫ్ ప్యాడీ మ్యాన్ (మలయాళం)
ది సీ అండ్ సెవెన్ విలెజెస్ (ఒడియా)
బెస్ట్ స్క్రిప్ట్: సన్ ఫ్లవర్స్ వోర్ ది ఫస్ట్ వన్స్ టు నో (కన్నడ)
బెస్ట్ వాయిస్ ఓవర్: ది సేక్రెడ్ జాక్ – ఎక్స్‌ప్లోరింగ్ ది ట్రీస్ ఆఫ్ విషెస్ (ఇంగ్లీష్)
బెస్ట్ మ్యూజిక్ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
బెస్ట్ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఇంగ్లీష్)
బెస్ట్ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ)
బెస్ట్ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళ్)
బెస్ట్ డైరెక్షన్: ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
బెస్ట్ ఎడిటింగ్: మూవీంగ్ ఫోకస్ (ఇంగ్లీష్)
బెస్ట్ సౌండ్ డిజైన్: దుందగిరి కే ఫూల్ (హిందీ)
బెస్ట్ సినిమాటోగ్రఫీ: లిటిల్ వింగ్స్ (తమిళ్)
బెస్ట్ డైరెక్షన్ : ది ఫస్ట్ ఫిల్మ్ (హిందీ)
బెస్ట్ ఆర్ట్స్/కల్చర్ ఫిల్మ్: టైమ్‌లెస్ తమిళనాడు (ఇంగ్లీష్)
బెస్ట్ బయోగ్రాఫికల్ ఫిల్మ్: మా బావు, మా గావ్ (ఒడిశా), లెంటినో ఓవో ఏ లైట్ ఆన్ ది ఈస్ట్రన్ హారిజాన్ (ఇంగ్లీష్
ఉత్తమ పరిచయ దర్శకుడు: మావ్:
ది స్పిరిట్ డ్రీమ్స్ ఆఫ్ చెరా (మిజో
బెస్ట్ నాన్ ఫీచర్ ఫిల్మ్: ఫ్లవరింగ్ మ్యాన్ (హిందీ)

## జనవరి 26 నాటికి అందుబాటులోకి

# 4000 మెగావాట్ల విద్యుత్



మొదటిపేజీ తరువాయి...
విశ్వంభర, మిర్యాలగూడ : నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం (వైటీపీఎస్)లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌ను మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం (వైటీపీఎస్)లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు. 55 ఎకరాల్లో రూ.970 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌ను నిర్మించనున్నారు. వనమహోత్సవంలో భాగంగా మంత్రులు ఇక్క మొక్కలు నాటారు. అనంతరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆగస్టు 15 లోపు వారికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల
సామర్థ్యం గల 5 కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.5వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు 7న సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 3, 4వ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. 5వ యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్లాంటుకు మూడు కిలోమీటర్ల సమీపంలో దుబ్బతండా వద్ద ఉద్యోగుల నివాస సముదాయాల కోసం సుమారు 60 ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

**జనవరి 26 నాటికి అందుబాటులోకి 4000 మెగావాట్ల విద్యుత్..**

అన్ని యూనిట్ల పనులను వేగవంతంగా పూర్తి చేసి వచ్చే జనవరి 26 నాటికి 4000 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం దామరచర్ల మండలం వీర్లపాలెం సమీపంలో నిర్మిస్తున్న యాదాద్రి పవర్ ప్లాంట్ ఉద్యోగులకు కల్పిస్తున్న ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ నిర్మాణ పనులకుశంకుస్థాపన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాధనం వృధా కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత సమయానికి పవర్ ప్లాంట్ పూర్తయ్యేలా పనులు చేపడుతున్నట్లు తెలిపారు.
గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ప్లాంట్ నిర్మాణం పనులు ఎక్కడికి అక్కడే నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం ప్రభుత్వంపై అధిక భారం పడుతున్నప్పటికీ ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ తీసుకోవడంతోపాటు పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ఇప్పటికే రెండో యూనిట్ ఉత్పత్తి ప్రారంభం కాగా ప్రస్తుతం మొదటి యూనిట్ ప్రారంభించుకోవడం ఆనందంగా వ్యక్తం చేశారు. మిగిలిన యూనిట్లను కూడా పూర్తి చేసి జనవరి 26 నాటికి పూర్తి స్థాయి విద్యుత్తును అందించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు సిబ్బంది కోసం సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ టౌన్షిప్ నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. వైటిపీఎస్ లోని ఉద్యోగులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలకు అత్యంత ఉన్నత ప్రమాణాలతో విద్య, వైద్యం అందించేందుకు పాఠశాల, వైద్యశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్ తో పాటు పులిచింతల లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూర్ జై వీర్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఎస్పీ చరణ్ పవర్, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంకు చేరిన కాళేశ్వరం కమిషన్ నివేదిక

## అందజేసిన మంత్రులు ఉత్తమ్, పొంగులేటి - నివేదికను అధ్యయనం చేసేందుకు కమిటీ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి...
విశ్వంభర, హైదరాబాద్: కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అధికారులు నీటిపారుదల శాఖ సెక్రెటరీ ప్రశాంత్ పాటిల్, జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి రామకృష్ణారావు కమిషన్ నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కమిటీని నియమించింది. నీటిపారుదల శాఖ సెక్రెటరీ, న్యాయ శాఖ సెక్రెటరీ, జీఏడీ సెక్రటరీ సభ్యులుగా నియమిస్తూ ఏర్పాటు చేసిన ఈ కమిటీ ఈ నెల 4న నివేదికను అధ్యయనం చేసి పూర్తి సారాంశాన్ని రాష్ట్ర కేబినెట్ కు సమర్పించనుంది.
కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. సంబంధిత నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఆయన అందజేశారు. శుక్రవారం ఆ నివేదిక సీఎంకు చేరింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌తో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు భేటీ అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై వీరంతా చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయని, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు తెలిసింది.
వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం పనులు జరిగాయని, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొన్నారని, ఆర్థిక అవకతవకలు జరిగాయని... ఇలా పలు అంశాలను కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ పేర్కొన్నట్లు సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ తయారీ మొదలుకొని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం... అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీల వరకు ఎప్పుడు ఏం జరిగింది... రికార్డుల ఆధారంగా ఎక్కడ ఎవరు బాధ్యులన్నది వివరంగా నివేదికలో తెలియజేసినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.



# దేశంలో బిజెపి ప్రభుత్వం అనేక రంగాల్లో విఫలం

## - ప్రియాంక కక్కర్



విశ్వంభర, హైదరాబాద్: ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ చీఫ్ స్పోక్స్ పర్సన్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ ప్రియాంక కక్కర్ శుక్రవారం తెలంగాణ రాష్ట్రానికి తొలిసారి వచ్చిన సందర్భంగా తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు , నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అనేక రంగాల్లో విఫలం అయింది. అమెరికా భారతదేశాన్నీ ఎంత అవమానం చేసిన మోడీ స్పందించడం లేదు. ఒక్క పాకిస్తాన్ వారికి మాత్రమే అతను అనుకూలంగా పనిచేస్తుంది. తెలంగాణలో ఆర్ఎస్ఎస్, టిడిపి ఐడియాలజీ ప్రకారం పరిపాలన కొనసాగుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం మర్చిపోయింది. తెలంగాణలో విద్యకు 7 శాతం. వైద్యానికి 4 శాతం బడ్జెట్ కేటాయించడం అంటే తెలంగాణను వెనకకు నెట్టి వేయడమే. తెలంగాణ విద్యలో 25వ స్థానంలో ఉంది అంటే ఇక్కడి ప్రభుత్వం ఎంత బాగా పనిచేస్తుందో అని అర్థమవుతుంది. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో ఉన్న శ్రద్ధ, విద్య, వైద్యం పై ఉంచాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తుంది. బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి గెలుస్తుంది. ఢిల్లీలో ఏ విధంగా అయితే ఓటర్లను తొలగించారు అదేవిధంగా త్వరలో జరగబోయే బీహార్లో కూడా స్థానికులైన ఓటర్లను తొలగించి గెలవాలని చూస్తుంది. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ...మేము ఇండియా కూటమిలో లేము అని వివరించారు. అనంతరం భారీ కాన్వాయ్ తో బయలుదేరి లిబర్టీ సర్కిల్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించిన తర్వాత అక్కడి నుండి పాదయాత్రగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో, పార్టీ నాయకులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఐడియాలజీ ప్రకారం నడుస్తుంది అని వివరించారు. విద్యకు ఏడు శాతం వైద్యానికి నాలుగు శాతం బడ్జెట్ కేటాయించడం అంటే తెలంగాణ ప్రజలను మోసం చేయడమని అని విమర్శించారు. ఆగస్టు 2 శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం ఉంటుందని, అందులో పూర్తి వివరాలు వివరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ ఇంచార్జ్ కన్వీనర్ డిడ్ డి సుధాకర్, ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ అధ్యక్షులు బుర్ర రాము గౌడ్, పార్టీ యువజన విభాగం మాజీ అధ్యక్షులు విజయ్ మల్లంగి , వికలాంగుల కమిటీ మాజీ అధ్యక్షులు దర్శనం రమేష్ , ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ ట్రెజరర్ అన్సారి, ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు హేమ జిల్లా, నార్సింగి యమున, డాక్టర్స్ వింగ్ నాయకురాలు లక్ష, మాజీ అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్ , యువజన విభాగం మాజీ ఉపాధ్యక్షుడు బాబూలాల్ పవర్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇన్చార్జి శివాజీ , మాజీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జ్ సలావుద్దీన్, ఖైరతాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ మహమ్మద్ మజీద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రేషన్ కార్డు అనేది ఆత్మగౌరవ పత్రం

## : మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు



విశ్వంభర, ఎల్బీనగర్: రేషన్ కార్డు అనేది ఒక పత్రం కాదని, ఆత్మగౌరవ పత్రం అని, రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డుల జారీ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున అమలు చేస్తోందని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ , జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజక వర్గం కర్మంజ్పత్ లోని కొత్త కాపు యాదవ రెడ్డి గార్డెన్స్లో శుక్రవారం జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల జీవితాలను మార్చాలంటే, గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వాలని కూడా అనుకోలేదని అన్నారు. ఏ ఇతర రాష్ట్రంలో లేని విధంగా, వివిధ సంక్షేమ పథకాల అమలులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డుల ద్వారా ప్రతి ఒక్కరికీ 6 కిలోల బియ్యం అందిస్తోందని ఆయన అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, గత ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్ల అప్పులు చేసినప్పటికీ, అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా ప్రతి ఇంటికి బియ్యం అందించే కార్యక్రమాన్ని అమలు చేయడం ద్వారా ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకుంటోందని అన్నారు. గత ప్రభుత్వ తొమ్మిదేళ్ల పాలనలో, ప్రాంతాలు మారిన వారి పేర్లను రేషన్ కార్డుల నుండి తొలగించినప్పుడు ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఇప్పుడు ప్రజలు తమ కొడుకులు, కొడుకుల పిల్లలను కూడా రేషన్ కార్డులలో నమోదు చేస్తున్నామని చెబుతూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంత్రి వివరించారు. ఆరు హామీలకు సంబంధించి ఇప్పటికే ఉచిత బస్సులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, మిగిలిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని ఆయన అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ పురోగతికి సంబంధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు బడ్జెట్లో రూ. 10,000 కోట్లు కేటాయించిందని, ఎల్బీ నగర్ నియోజక వర్గంలో మురుగు నీటి వ్యవస్థలు, డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా 200 కోట్లు కేటాయించిందని వివరించారు. నగరాన్ని నాలుగు దిశలకూ సులభంగా చేరుకోవడానికి ప్రభుత్వం ఆర్టీసీ బస్సు, మెట్రో రైలు సౌకర్యాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటోందని, మెట్రో రైలుకు నిధులు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంలోని సంబంధిత శాఖ మంత్రిని పదేపదే కోరినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడం దురదృష్టకరమని మంత్రి అన్నారు. జిల్లా కేంద్రాలకు సులభంగా, సురక్షితంగా చేరుకోవడానికి ఔటర్ రింగ్ రోడ్డు నుండి ప్రాంతీయ రింగ్ రోడ్డుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, రెండేళ్లలో పూర్తి చేయబోతున్నామని మంత్రి వివరించారు. కాంగ్రెస్ హయాంలో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం జంట నగరాలకు కృష్ణా, మంజీరా నదుల నుండి నీటిని తీసుకు వచ్చిందని, పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క చుక్క నీటిని కూడా తీసుకు రాలేదని ఆయన అన్నారు. గోదావరి జలాలను పూర్తి స్థాయిలో తీసుకురావడానికి ప్రస్తుతం కొత్త ప్రాజెక్టును చేపడతామని మంత్రి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపు 65 వేల ఉద్యోగాలు సృష్టించామని, దీనితోపాటు రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకు వస్తున్నామని చెప్పారు. దీనివల్ల ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూనే మరో వైపు అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. అనంతరం జీహెచ్ఎంసీ పారిశుధ్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాల కిట్లను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పట్నం మహేందర్రెడ్డి, దయానంద్ గుప్తా, టీయూఎఫ్ఐడీసీ ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డి రాంరెడ్డి, ఆర్డీఓ రాజేశ్వర్రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పారిజాత, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# లక్నవరం చెరువు కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం

### - త్వరలో రామప్ప చెరువు నుండి కెనాల్ ద్వారా లక్నవరం చెరువును పూర్తిగా నింపుతాం



విశ్వంభర, ములుగు : గోవిందరావుపేట లక్నవరం వద్ద పంట కాలువలకు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం రోజున నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత కొంతకాలంగా రైతులకు నాట్లు వేసుకోవడానికి నీటి కొరత ఉందని తెలుసుకొని, ఇటీవల లక్నవరం సరస్సు తూముల మరమ్మతు పనుల అనంతరం నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం లక్నవరం సరస్సు 28 ఫీట్ల నీటి మట్టం కలిగి ఉందని, మొత్తం 33 ఫీట్లు సామర్థ్యాన్ని సరస్సు కలిగి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు రైతుకు తదితరులు పాల్గొన్నారు.

# చేనేతను ధరించండి నేత వృత్తిని కాపాడండి

## - ఎమ్మెల్సీ ఎల్ రమణ



విశ్వంభర, హైదరాబాద్: దేశ స్వతంత్ర సంగ్రామంలో కీలక భూమిక పోషించిన చేనేత ఈ పోటీ ప్రపంచంలో పోటీని తట్టుకోలేక కనుమరుగయ్యే వృత్తుల జాబితాలో చేరబోతుందని ఆవేదన వ్యక్తం చేశారు శుక్రవారం వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నారాయణగూడ పద్మశాలి భవన్లో ఏర్పాటుచేసిన హ్యాండ్లూమ్ ఎక్స్పోను మాజీ మంత్రి ఎమ్మెల్సీ ఎల్ రమణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నుంచి వీరు చేస్తున్న కృషి అభినందనీయమని ప్రతి ఒక్కరు చేనేత వస్త్రాలను ధరించి వృత్తిని కాపాడాల్సిన అవసరం ప్రతి పౌరుడుపై ఉందన్నారు గత సంవత్సరం ఈ ఎక్స్ పో ద్వారా కోటి 50 లక్షల రూపాయల వస్త్ర ఉత్పత్తుల విక్రయాలు జరిగాయని అట్టి విక్రయాలలో ఒక్కటి కూడా రిమార్క్ అనే కంప్లైంట్ రాలేదని దీనిబట్టి నాణ్యమైన వస్త్రాలు అందించే చేనేత ప్రదర్శనను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షులు మరియు సెక్రటరీ జనరల్ కందగట్ల స్వామి, గడ్డం జగన్నాథం లు మాట్లాడుతూ ఇలాంటి ప్రదర్శనలలో కొనుగోలు చేస్తే ఈ ఉత్పత్తులని సమాజానికి అందించే చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందన్నారు ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు గుంటుక రూప మాట్లాడుతూ మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి నేతన్నలను ప్రోత్సహించాల్సిన అవసరం మహిళలపై ఉందన్నారు చేనేత వస్త్రాలు పర్యావరణాన్ని పర్యావరణాన్ని కాపాడడంలో ఎంతో కృషి చేస్తాయన్నారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్థపు మురళి ప్రధాన కార్యదర్శి మాచర్ల రామచంద్రరావు , అఖిలభారత పద్మశాలి సంఘం యువజన విభాగం జాతీయ ఇంచార్జ్ అవ్వారి భాస్కర్, గుర్రం శ్రవణ్, శోభా,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్, టి పి ఎస్ మహిళా విభాగం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలుశారద ప్రభాకర్ పోరండ్ల, టిపిఎస్ మహిళా విభాగం జనరల్ సెక్రటరీస్వప్న రాజ్ కుమార్ చిన్నకోట్ల , టిపి పిఎస్ మహిళా విభాగం కోశాధికారి రేఖా నోముల, అరుణశ్రీ కైరం కొండ స్వరూప,బొమ్మరిల్లు విజయ సన్నపురి సరోజ , మౌనిక కటకం ,ఆడెపు శాంతి , అర్షణ్ పల్లి సుజాత తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు సరుకుల పంపిణీ



విశ్వంభర, చండూర్: రెండు సంవత్సరములు వరకు ప్రతినెల 30 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల విలువ చేసే నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలనే లక్ష్యంతో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు, గాంధీజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు గత సంవత్సరం జనవరి నెల ఒకటో తేదీన ప్రారంభించిన గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో "నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ" కార్యక్రమం శుక్రవారం నాడు స్థానిక గాంధీజీ విద్యాసంస్థల యందు 20వ నెల పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమమునకు ముఖ్య అతిథులుగా చండూరు మున్సిపల్ కమిషనర్ ఎల్. మల్లేశం లు హాజరై వారు మాట్లాడుతూ నాలుగు పైసలు సంపాదిస్తే అయినవారిని మర్చిపోతున్న నేటి రోజుల్లో తన కండ్ల ముందు పేదరికంతో అల్లాడుతున్న వారికి ఆసరాగా ఉండాలన్న ధ్యేయంతో డాక్టర్ కోడి శ్రీనివాసులు స్థాపించిన గాంధీజీ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. మానవసేవయే మాధవ సేవ అని నిరుపేదలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్లు అని అన్నారు. గాంధీజీ ఫౌండేషన్ ఇంకా ఎక్కువ మందికి సేవ చేసే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని, రాబోయే రోజుల్లో ఈ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవలు పేద ప్రజలకు అందాలని ఆశించారు. కోడి శ్రీనివాసులును ఆదర్శంగా తీసుకొని సమాజంలో ఆర్థికంగా ఉన్న మరికొంతమంది ముందుకు వచ్చి నిరుపేదలను ఆదుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గాంధీజీ ఫౌండేషన్ చైర్మన్, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కోడి శ్రీనివాసులు, మున్సిపాలిటీ ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ అరవింద రెడ్డి, గాంధీజీ విద్యాసంస్థల డైరెక్టర్ సరికొండ వెంకన్న, ప్రిన్సిపల్స్ భార్గవ్ , పులిపాటి రాధిక, ఋషిపాక యాదగిరి, బోడ విజయ్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# వైశ్య రాజకీయ రణభేరి విజయవంతం చేద్దాం: మేడ్చల్ అధ్యక్షుడు బెల్దె రమేష్



విశ్వంభర, ఘట్కేసర్: ఆగస్టు 3వ తేదీన హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డా. కాచం సత్యనారాయణ గుప్త ఆధ్వర్యం లో జరిగే వైశ్య రాజకీయ రణభేరి కార్యక్రమం ను విజయవంతం చేద్దాం అని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బెల్దే రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఘట్కేసర్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి వైశ్య వికాస వేదిక , రాజకీయ వైశ్య రణభేరి అధ్యక్షలు డా. కాచం సత్యనారాయణ గుప్త ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో వైశ్యుల వాటా తేల్చాల్సిందేనని అన్నారు. ఈ డబ్ల్యూ ఎస్ లో వర్గీకరణ తేవాలని అన్నారు. ఏ రాజకీయ పార్టీ అయినా వైశ్యులను గుడి , బడి వద్ద సేవ కార్యక్రమాలకు వాడుకుంటున్నారే తప్ప, రాజకీయంలో సీట్లు కేటాయించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు నరేష్ కుమార్, అనిల్ బాబు, కాచం వెంకట హరి, పెద్ది శ్రీనివాస్, బచ్చు మారయ్య, చంద్రశేఖర్, శరత్, బచ్చు విజయకుమార్, విశ్వనాథం, సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేష్, రాములు, భూక్క ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

# శాంతి సంఘీభావ ఉద్యమాలను నిర్వహించాలి



విశ్వంభర, హైదరాబాద్: ప్రజలంతా యుద్ధాలకు వ్యతిరేకంగా శాంతి - సంఘీభావ ఉద్యమాలను రాష్ట్రవ్యాప్తంగా బలోపేతంగా నిర్వహించాలని అఖిలభారత శాంతి సంఘీభావ సంగం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె. వి. ఎల్ పిలుపునిచ్చారు. శుక్రవార అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో కే.వీ.ఎల్. మాట్లాడుతూ శాంతి సంఘీభావ సంఘం కేంద్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల ఒకటో తారీకు నుండి ఎనిమిదో తారీకు వరకు పాలస్తీ నాకు మద్దతుగా దేశమంతట %ఖుఅజూంశీ% ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా వివిధ రూపాలలో కార్యక్రమాలు నిర్వహించాలని , ఆగస్టు ఆరో తారీఖున హిరోషిమా డే ను, 9వ తారీఖున నాగసాకి డేను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కార్యక్రమాలను నిర్వహిస్తూ 1945లో జరిగినటువంటి యుద్ధ విధ్వంశాలను , అదేవిధంగా నేడు పాలస్తీనా పై ఇజ్రాయిల్ చేస్తున్నటువంటి ఏకపక్ష యుద్ధాన్ని , ఉక్రెయిన్ రష్యాల మధ్య జరుగుతున్నటువంటి యుద్ధాలను అమెరికా ఇరాన్ పై చేసినటువంటి యుద్ధాలను వాటి ఫలితంగా ఆయా దేశాల్లోనే కాకుండా ప్రపంచంలో తలెత్తినటువంటి విధ్వంసాన్ని, నష్టాలను, కష్టాలను, కన్నీళ్లను, ప్రజలకు తెలియజేసి శాంతి యొక్క ప్రాముఖ్యతను ,సంఘీభావ ఉద్యమాల అవసరాన్ని గుర్తింపచేయాలని కేవీఎల్. అన్ని జిల్లా కమిటీలకు పిలుపునిచ్చారు. శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యంలో మరియు వీలైన చోట్లలో సంఘీభావ ఉద్యమాలను నిర్వహించాలని విస్తరింప చేయాలని, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా యుద్ధం వాదానికి వ్యతిరేకంగా , రేసిజానికి , మతోన్మాదానికి వ్యతిరేకంగా నిత్యం పోరాడుతూ ప్రజలలో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పటానికి కృషి చేయాలని , పంద్రాగస్టు సందర్భంగా వీలైన చోట్ల విద్యార్థులకు సెమినార్లు, స్వాతంత్ర్య పోరాట గొప్పతనాన్ని శాంతి యొక్క ప్రాధాన్యతను తెలియజేయాలని అన్ని జిల్లా కమిటీల సమావేశాలు నిర్వహించి శాంతి సంఘీభావ సంఘం నిర్మాణ బలోపేతానికి కృషి చేయాలని ,రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కె.వి.ఎల్. తెలియజేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జి నాగేశ్వర రావు మాట్లాడుతూ సమాజంలో ప్రజలంతా చైతన్యవంతమైనప్పుడే ప్రజల కష్టాలు తీరుతాయని యుద్ధాల స్థానంలో శాంతి ఉంటుందని అన్నారు. అన్ని దేశాలలో సంఘీభావ ఉద్యమాలు ప్రజలందరూ పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని తెలియజేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఏ రామరాజు, కార్యదర్శి జే. కే .శ్రీనివాస్. పాల్గొన్నారు

# రాష్ట్రం అప్పులో ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం


విశ్వంభర, పరిగి: పట్టణంలో విలేకర్ల సమావేశంలో తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ,ఏఐసీసీ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి శ్రీధర్ బాబు స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ.. దేశంలో రెండు రకాల ప్రేమానురాగాలు ఒక రకమైతే ,ఉద్దేశాలతో కూడిన రాజకీయం ఇంకొక రకం ఈ విషయంలో రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో పార్లమెంటులో చర్చ నడిచింది అన్నారు. రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ధర్నా కూడా చేపట్టామని పేర్కొన్నారు. తెలంగాణ కార్యకర్తలతో మేము ఉంటున్నామని పరిగిలో పాదయాత్ర విజయవంతంగా జరిగిందన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల్ని కాకుండా ప్రజల సలహాలు సూచనలే కాకుండా వాస్తవాలను తెలుసుకున్నామన్నారు. గాంధీ నుండి మొదలుపెడితే రాహుల్ గాంధీ జోడో యాత్ర వరకు ఎన్నో పాదయాత్రలు జరగాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క పాదయాత్రలు ప్రజలను చైతన్యం చేశాయన్నారు. అధికారంలోనికి వచ్చింది ప్రజల ఆకాంక్షతో కాంగ్రెస్



ప్రభుత్వం పాలన అందిస్తుందన్నారు. 7 లక్షల కోట్ల అప్పుతో ఉన్న కూడా ప్రతి నెల 6000 కోట్ల రుణాలు అప్పు కడుతున్నామ న్నారు. ఇంత అప్పులు కట్టుకుంటూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ కు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి, చేవెళ్ల కాంగ్రెస్ ఇంచార్జ్ బీమ్ భరత్,పాల్గొన్నారు.

# దేశ చరిత్రపై చెరగని సంతకం పింగళి

**(నేడు ఆయన జయంతి)**



జాతీయ జెండా.. ప్రతి దేశానికి ఇది చాలా ప్రత్యేకం. మన దేశానికి కూడా మువ్వన్నెల పతాకం అలానే. ఆ త్రివర్ణ పతాకాన్ని చూసిన ప్రతిసారీ ఈ దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో చేసిన త్యాగాలు, పోరాటాలు, బానిస సంకెళ్లను తెంచుకున్న తర్వాత ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో మన భారత దేశం ఎదుర్కొన్న ఒడుదుడుకులు అన్నింటినీ తలచుకుంటూ.. మన దేశం సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ ప్రతి భారతీయుడు గర్విస్తాడు. ఆ గర్వానికి, మన దేశ గౌరవానికి చిహ్నమైన త్రివర్ణ పతాకాన్ని రూపొందించిన వ్యక్తి ఒక తెలుగువాడు.. ఆయన పేరే పింగళి వెంకయ్య. నేడు ఆయన జయంతి సందర్భంగా ప్రజా విశ్వంభర ప్రత్యేక కథనం..పింగళి వెంకయ్య ఆయన పేరు ఇప్పటి తరంలో ఎందరికో తెలియకపోయినా.. భారత దేశ పతాక రూపకర్తగా దేశ చరిత్రపై చెరగని సంతకం చేశారాయన. భారత దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధీని మనం ఎంతలా గుర్తుంచుకున్నామో ఈ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యను కూడా అంతే గుర్తుంచుకోవాల్సిన బాధ్యత మనకుంది. జాతీయ పతాకాన్ని రూపొందించడానికి పింగళి వెంకయ్య ఒక రోజో, నెలో, ఏడాదో కష్టపడలేదు. మన దేశానికి సరైన జాతీయ పతాకాన్ని రూపొందించడానికి ఆయన తన జీవితంలో సుమారు 20 ఏళ్ల కాలాన్ని వెచ్చించారు. పింగళి వెంకయ్య 1876, ఆగస్టు 2న కృష్ణా జిల్లా భట్ల పెనుమర్రులో జన్మించారు. 19 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ ఆర్మీలో చేరి ఆఫ్రికాలో ఆంగ్లో–బోయర్ యుద్ధంలో పాల్గొన్నారు. ఆ సమయంలోనే మహాత్ముడితో పరిచయం ఏర్పడింది. స్వాతంత్ర్య సంగ్రామంలో అలుపెరగని కృషి చేసిన పింగళి వెంకయ్య అనేక రంగాల్లో నిష్ణాతుడు. జపాన్ భాషలో ఆయన అనర్గళ వాగ్ధాటిని చూసిన జనం ఆయనను జపాన్ వెంకయ్య అని పిలుచుకునేవారు. 1907 నుంచి 1910 వరకు వెంకయ్య మునగాల పరగణాలో వ్యవసాయ అధికారిగా పనిచేసారు. కొత్త రకం పత్తి వంగడాల అభివృద్ధిలో ఆయన విశేష కృషి చేశారు. మునగాల పరిధిలోకి రైతులు ఆయనను అప్యాయంగా పత్తి వెంకయ్య అని పిలిచేవారు. 1911 నుంచి 1920 వరకు మచిలీపట్నం నేషనల్ కాలేజీలో టీచర్‌గా కూడా ఆయన పనిచేశారు. విద్యార్థులకు జీవననైపుణ్య పాఠాలు ఆయన బోధించారు. పిల్లలకు పట్టు సాగు, ఈత, గుర్రపు స్వారీ, వ్యవసాయం వంటివి నేర్పించారు. ఆయనను విద్యార్థులు ఎంతో ప్రేమతో వెంకయ్య మాస్టరూ అనే పిలుచుకునేవారు. వెంకయ్య సన్నిహితులు ఆయన్ను జపన్ వెంకయ్య, పత్తి వెంకయ్య, జనద వెంకయ్య అని పలు రకాలుగా పిలుచుకునేవారు. వెంకయ్య గొప్ప దేశభక్తుడు, జియాలజిస్ట్, రచయిత కూడా. 1911–44 వరకు బందరు జాతీయ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేశారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో భూగర్భ శాస్త్ర పరిశోధనలు చేసి డిప్లొమా పొందారు. వజ్రాలపై ఆయన అనేక పరిశోధనలు చేశారు. 1924 నుంచి 1944 వరకు నెల్లూరులో మైకా గురించి పరిశోధనలు చేశారు. బొగ్గు వజ్రంగా మారే విధానాన్ని గురించి 'తల్లిరాయి' అనే పుస్తకం రాశారు. ఆంధ్రా ప్రాంతంలో వజ్రాలపై చేసిన పరిశోధనకు గాను ఆయనకు వజ్రాల వెంకయ్య అనే పేరు కూడా వచ్చింది.ఒక పక్క ఉద్యోగం చేస్తూనే1906–1922 మధ్య ఆయన వెంకయ్య అనేక జాతీయోద్యమాల్లో పాల్గొన్నారు.ఉద్యోగాలు చేస్తున్నా మనసు మాత్రం దేశభక్తి, జాతీయ జెండా వైపు లాగింది. మన జాతికి, మన జాతి నిర్వహిస్తున్న ఉద్యమాలకు ఒక పతాకం ఉండాలన్న ఆలోచన చేశారు.తన మనసు చూపిన మార్గాన్నే ఎంచుకున్న వెంకయ్య.. జాతీయ జెండాల రూపకల్పన ప్రారంభించారు. 1913 నుంచి కాంగ్రెస్ నిర్వహించిన ప్రతి సమావేశంలో ఆయన జాతీయ జెండా ప్రస్తావన తీసుకొచ్చారు. జెండా రూపకల్పన కోసం ఎన్నో దేశాల చరిత్రలు చదివారు. అందుకోసం ఆయన ఇతర దేశాల భాషలను కూడా నేర్చుకున్నారు. 1916లో ఆయన "భారత దేశానికి ఒక జాతీయ పతాకం" అనే ఓ గ్రంథాన్ని ఇంగ్లీషులో రాశారు. అందులో ఆయన రూపొందించిన 24 రకాల జెండాల నమూనాలు ఉన్నాయి. వాటితో పాటు ఆ జెండాలు వేటిని ప్రతిబింబిస్తాయి అన్న అంశాలను కూడా ఆయన పొందుపరిచారు.1916లో పింగళి వెంకయ్య రూపొందించిన జెండాను లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశంలో తొలిసారి ఎగరవేశారు. అందులో రాట్నం బొమ్మను పెట్టాలని 1919లో జలంధర్ వాస్తవ్యులు 'లాలా హన్స్ రాజ్' సూచించారు. బెజవాడ వేదికగా 1921లో అఖిల భారత కాంగ్రెస్ మహాసభలు జరిగినప్పుడు గాంధీజీ.. వెంకయ్యను ఆ సమావేశానికి పిలిపించి కాషాయం, ఆకుపచ్చ రంగులు, మధ్య రాట్నం గల ఒక జెండాను రూపొందించాలని కోరారు. మహాత్ముడు సూచనలతో ఒక జెండాను వెంకయ్య రూపొదించగా.. సత్యం, అహింసలకు ప్రత్యక్ష నిదర్శనమైన తెలుపు రంగు కూడా ఉండాలని గాంధీజీ అభిప్రాయపడ్డారు. దీంతో వెంకయ్య ఆ జెండాలో అదనంగా తెలుపు రంగును చేర్చి నేటి త్రివర్ణ పతాకాన్ని దేశానికి ప్రసాదించారు.గాంధీజీ ప్రోద్బలంతో త్రివర్ణపతాకం పుట్టింది బెజవాడలోనే. కాషాయం హిందువులకు చిహ్నమని, ఆకుపచ్చ ముస్లింలకని పేర్కొనడంతో, ఇతర మతాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలనే అభిప్రాయం వెలువడడంతో గాంధీజీ సూచనపై ఆకుపచ్చ, కాషాయ రంగులుతో పాటు తెలుపు కూడా చేర్చి త్రివర్ణ పతాకాన్ని వెంకయ్య రూపొందించారు. మధ్యనున్న రాట్నం గ్రామ జీవనాన్ని, రైతు కార్మికత్వాన్ని స్ఫురింపజేస్తుందన్నారు. కార్మిక, కర్షకులపై ఆధారపడిన భారతదేశం, సత్య హింసలను ఆచరించడంతో సుభిక్షంగా ఉంటుందని మన ఆశయం. ఆ ఆశయ చిహ్నమే మన త్రివర్ణ పతాకం. పింగళి వెంకయ్య రూపొందించిన పతాకాన్ని జాతీయ పతాకంగా గుర్తిస్తూ 1921 మార్చి 31 ఏప్రిల్ 1 వరకు విజయవాడలో మహాత్మాగాంధీ అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ కమిటీ సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఆ తర్వాత ఈ పతకానికి కొద్దిగా మార్పులు చేశారు. గాంధీ సూచన మేరకు దానిపై 'రాట్నం' గుర్తు చేర్చారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ సూచన మేరకు రాట్నం స్థానంలో అశోకచక్రం వచ్చి చేరింది.ఏప్రిల్ 13, 1936 నాటి 'యంగ్ ఇండియా' పత్రికలో గాంధీజీ పింగళి వెంకయ్యను ప్రత్యేకంగా ప్రశంసించారు.ఆ తర్వాత 1947 జూలై 22న మన తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ.. జాతీయ జెండాలో రాట్నం గుర్తును తొలగించి అశోక చక్రాన్ని పెడుతున్నట్లు రాజ్యసభలో తీర్మానం చేశారు. అప్పటి నుంచి ఇప్పుడు మనం చూస్తున్న జాతీయ జెండానే చలామణిలో ఉంది. నిస్వార్థంతో, గాంధేయవాదిగా అతి సాధారణమైన జీవితాన్ని గడిపిన పింగళి వెంకయ్య గారు చేసిన సేవ అనితరము. ఆయనలాగే దేశ సేవకే తమ జీవితాలను అంకితం చేసిన ఎందఱో మహానుభావులు, వారి సేవలకు సరైన గుర్తింపు లభింపక మరుగున పడిపోయారు. వెంకయ్య కూడా తన వృద్ధాప్యం లో ఆర్థిక సమస్యలతో సరైన సహాయం అందక ఎన్నో ఇబ్బందులు పడి తన ఎనభై ఆరో ఏట 4 జూలై 1963న పరమపదించారు. అయిననూ, మన జాతీయ జెండా ఎగురుతున్నంత కాలం తెలుగు వారి గుండెల్లో పింగళి వెంకయ్య పేరు చిరస్థాయిగా నిలిచిపోతుంది. నేడు ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను స్మరించుకుందాం.

**పోతుగంటి వెంకటరమణ**

# 25శాతం ట్యాక్స్‌తో భారతీయ ఆర్థిక వ్యవస్థకు ఇబ్బందే..



25 శాతం టాక్స్ అం టే.. ఏదో ఉబుసుపోక కబురు, పిల్లచేష్ట, వేళా కోళం అని అనుకుం టున్నది మన దేశ భృత్యు మూక. ప్రపంచ పెద్దన్న ట్రంప్ దొర వారు ప్రకటించిన 25 శాతం పన్ను అమలులోకి వస్తే.... ఇండియానుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే ప్రతి వ స్తువు ధర అమాంతం 25 శాతం పెరుగి పోతుంది. రూపాయి వస్తువు రూపాయి పావలా అయిపోతుంది అంతే కదా.మనం అమెరికాకు ఎగుమతి చేసే వాళ్లమే కదా,వాటిని కొనేవాడు ఇండియన్ కాదు కదా, అమెరికా వాడే కదా. దాని గురించి భారతీయులు బాధప డవలసిన అవసరం ఏమిటి! అనే ఒక చిత్రమైన వాదనను ముందుకు తీసుకు వచ్చింది ఈ మూక. ఈ కోణంలో సోషల్ మీడియాలో "వాట్సఆప్ మేధావి బ్యాచ్" ఈ చిత్రమైన వాదులాట అప్పుడే మొదలు పెట్టింది. నిజమే ఆ వస్తువులను కొనేవాడు అమెరికా వాడే. కాదని ఎవరూ చెప్పరు. ఆ పన్ను భారం ఆ అమెరికాలో ఆ వస్తువులు కొనేవాడే భరించాలి, మొయ్యాలి.అయితే పెంచిన ఆ 25 శాతం అదనపు ధరతో భారతీ య వస్తువులను ఎందుకు కొంటాడు?ఎందుకు కొనాలి ? అమెరికాకు దిగుమతి అయ్యే ఆ భారతీయ వస్తువుకు మరో ప్రత్యామ్నాయ వస్తువును అమెరికన్ వినియోగదారుడు ఎంచుకుంటాడు కదా. అప్పుడు భారతీయ వస్తువుల డిమాండ్ అమెరికాలో పడిపోతుంది.అంటే అమెరికా ఎగుమతి పరిమాణం తగ్గిపోతుంది. అప్పుడు అనివార్యంగా ఆ వస్తువుల ఉత్పాదక పరిమాణం ఇండియన్ పరిశ్రమ తగ్గించవలసి వస్తుంది. అప్పుడు ఆ పరిశ్రమ కొంత సంక్షోభంలో పడి పోతుంది. దానిలో పనిచేసే కొందరు కార్మికుల ఉపాధి దెబ్బ తింటుంది. ఫలితంగా భారత ఆర్థిక వ్యవస్థ కొంత ఇబ్బంది పడిపోతుంది. ఇది అంతా కామన్ సెన్స్ కు సంబంధించిన అతి చిన్న అంశమే కదా. కానీ మన మట్టి బుర్రల మూకకు మాత్రం ఇది అర్థం కావటం లేదు.




**- గందె గోవర్ధన్**

# భృత్యు మూకది భలే వింత పోకడ !

ప్రాసిక్యూషన్ ఫెయిల్యూర్ నేర విచారణ వ్యవస్థ వైఫల్యంను కూడా నిర్దోషిత్వం అని ప్రచారం చేసుకుంటున్నది భృత్యు మూక. ఆధారాలు సమర్పించని కారణంగా నిర్దోషులుగా ప్రకటించిన వారిని చూపుతూ మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకుంటున్నది ఈ భృత్యు మూక. సదరు నిర్దోషులు పరివారం సభ్యులు కాబట్టి మాత్రమే ఈ సంబరాలు. ఇవే కారణాలతో వీళ్లకు నచ్చని వారు, వీళ్లు శత్రువులుగా భావించే వారు నిర్దోషులుగా విడుదలైతే వీళ్ల స్పందన పూర్తిగా భిన్నంగా, వ్యతిరేకంగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో.. విచారణ వ్యవస్థ, పోలీసులు అమ్ముడు పోయిందని, జడ్జీలను కొనేశారు అనే వాదనలకు ఈ భృత్యు మూక దిగడం అనేక సందర్భాల్లో మనం చూశాం. కోర్టులో నిరూపించబడనంత మాత్రాన ఎవరూ నిర్దోషులు అయిపోరు. తప్పుడు సాక్ష్యాలు, ఆధారాలను సృష్టించి కోర్టులపై ఒత్తిడి తీసుకు వచ్చి, జడ్జీలను బెదిరించి, ప్రలోభ పెట్టి, నేరాలు జరిగాయని నిరూపించినంత మాత్రాన ఎవరూ దోషులైపోరు. ఆధారాలు లేని కారణంగా, అవి ఉన్నా విచారణ వ్యవస్థలు వాటిని కోర్టుకు సమర్పించని కారణంగా దేశంలో అనేక కేసులు కొట్టి వేయడం అందరికీ అర్థమైన సంగతే.ఫలితంగా దోషులు నిర్దోషులుగా, నిర్దోషులు దోషులుగా విడుదలైన అనేక తీర్పులను లోకమంతా చూసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి విచిత్రమైన దుస్థితి భూమి మీద మరో చోట ఉందో? లేదో? తెలియదు కాని.. ఇక్కడ మాత్రం ఇలాంటి చిత్ర,విచిత్రాలు అనేకం చాలాకాలంగా ఆవిష్కృతమౌతున్న, అయిన సందర్భాలు బోలెడన్ని మన కళ్ల ముందున్నాయి. వాటికి కారణాలు ఊహించడం




పెద్ద కష్టమైన పనేమీ కాదు. దానికి పెద్దగా మేధస్సులు అక్కర్లేదు. న్యాయశాస్త్రం కూడా తెలియనక్కరలేదు. ఇవి అర్థం కావడానికి సాధారణ లోకజ్ఞానం చాలును. విచారణ వ్యవస్థలు ఎలా పని చేస్తున్నాయో? వాటి పోలీసు,CBI,ED,IT, NIA,RAW etc..]ని వెనక నుంచి ఆడిస్తున్న రింగ్ మాస్టర్లు ఎవరో? వాటికి కారణాలు ఏమిటో? అవి ఎవరికి, ఎలా లబ్ధి చేకూర్చుతాయో? ఇప్పటికే చేకూర్చాయో? చదువు సంధ్య లేని అతి సామా న్యులకు కూడా తెలుసు. ఈ కనీస సాధారణ లోకజ్ఞానం కూడా లేని, తెలియని, అర్థం కాని అమాయక చక్రవర్తులు ఇక్కడ ఎవరూ లేరు.

**గందె గోవర్ధన్**

# కలగా మారుతున్న గిరిజన వర్సిటీ..!

అడవుల జిల్లా ఆదిలాబాద్ అంటేనే... ఆదివాసీలు. అలాంటి ఆదిలాబాద్‌కు గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ గతంలో పాలకులు ప్రకటన సైతం చేశారు. కానీ యూనివర్సిటీ ఏర్పాటు కల నేటికి నెరవేరకపోవడంతో, జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కల కలగానే మిగిలిపోనుందా అని జిల్లా ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉన్నత విద్యా సంస్థల స్థాపనకు అనువైన ప్రాంతాల అధ్యయనానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నియమించిన ప్రొఫెసర్ల కమిటీ ఆదిలాబాద్ ప్రాంతంలో ఉన్నత విద్య సంస్థల ఏర్పాటుకు అనువైన అవకాశాలు పూర్తి స్థాయిలో ఉన్నాయని దింతో జిల్లాకు గిరిజన యూనివర్సిటీని ప్రకటించిన సంగతి తెలిసిందే. దశాబ్దాలుగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కాకపోవడం పాలకుల చిత్తశుద్ధికి అద్దంపడుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని పాత 10 జిల్లాల్లో యూని వర్సిటీ లేని ఏకైక జిల్లాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నిలిచింది.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సహజసిద్ధ ప్రకృతి వనరులకు, అడవులకు, భిన్న సంస్కృతి సంప్రదాయాలకు ప్రసిద్ధి. సింగరేణి బొగ్గు గనులు, సున్నపురాయి, కాగితపు పరిశ్రమ, మాంగనీస్ గను లు విస్తరించాయి. పెన్ గంగా, గోదావరి, ప్రాణహిత, పెద్దవాగు నదులున్నాయి. మూడు కాలాల్లో నమోదయ్యే భిన్నమైన వాతావరణ స్థితిగతులు పరిశోధనలకు నెలవు. దేశంలోనే అత్యంత ప్రాముఖ్యత కల్గిన చదువుల తల్లి సరస్వతి దేవి కొలువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం లేకపోవడంతో ఈ ప్రాంత వాసులు ఉన్నత చదువుల కోసం అష్టకష్టాల నడుమ ఉమ్మడి జిల్లాను దాటి వేరే జిల్లాలకు వెళ్తున్నారు.మరికొంత మంది ఆర్థికభారం, దూరభారం వల్ల మధ్యలోనే చదువులకు స్వస్తి పలుకుతున్నారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాలలో అంబేద్కర్ విశ్వవిద్యాల యం అధ్యయన కేంద్రాలు, దూర విద్యాకేంద్రాల ద్వారా పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయే తప్పితే పూర్తి స్థాయి పీజీ కోర్సుల కళాశాలలు లేకపోవడం ఉన్నత చదువుకు ప్రతికూలంగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తే ఈ ప్రాంత వాసులకు ఉన్నత చదువులకే కాకుండా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి.అత్యంత వెనుకబడిన జిల్లాగా పేరున్న ఉమ్మడి జిల్లాల్లో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండడం, సుమారు మూడు లక్షల యాభై వేలకు పైగా గిరిజనులు ఉన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా భౌగోళికంగా మహారాష్ట్ర, ఛత్తీషగఢ్‌లతో సరిహద్దును పంచుకోవడం, జిల్లా గుండా జాతీయ రహదారి 44 తో పాటు ఇతర రహదారులు వెళ్లడం, దక్షిణ మధ్య రైల్వే లైన్ జిల్లా నుండి వెళ్లడం, యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన భూములు ఉన్నప్పటికీ గిరిజన విశ్వవిద్యాలయం జిల్లాలో ఏర్పాటు చేయించడంలో ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు వైఫల్యం చెందారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2008 లో కేంద్రంలో అధికారంలో ఉన్న యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అదే సంవత్సరం నవంబర్ 17న జీవో 797 ను విడుదల చేసింది. అప్పట్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు 2011 ఆగస్టు 27న జీవో 783 ని జారీ చేసింది. దీంతో జిల్లా, ఐటీడీఏ అధికార యంత్రాంగం ఉట్నూర్ లో యూనివర్సిటీ ఏర్పాటుకు కావాల్సిన భూమిని గుర్తించింది. ఆదిలాబాద్ జిల్లాలో ఏర్పాటు కావాల్సిన యూనివర్సిటీ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ములుగు జిల్లాకు తరలించుకుపోయారు. ఉట్నూర్ లో ఏర్పాటు కావా ల్సిన గిరిజన విశ్వవిద్యాలయంను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజా ప్రతినిధుల, రాజకీయ నాయకుల నిర్లక్ష్యం కారణంగానే ములుగు జిల్లాకు తరలిపోయిందని జిల్లా ప్రజలు పేర్కొంటున్నారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటుకై పాలకులపై స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు ఒత్తిడి చేయలేకపోవడంతోనే జిల్లా నుండి గిరిజన యూ నివర్సిటీ తరలిపోయిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గిరిజన యూనివర్సిటీ ఏర్పా టు కోసం ఉద్యమాలు చేసామని ఈ ప్రాంత ఆదివాసీ, గిరిజన సంఘాల నేతలు, విద్యార్థి సంఘాల నేతలు, విద్యావేత్తలు, మేధావులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.శ్యామ్ పిట్రోడా నేతృత్వంలోని నాలెడ్జ్ కమిషన్ సిపార్సుల మేరకు ప్రతి జిల్లాలో విశ్వవిద్యాలయలు ఏర్పాటు చేయాలని గతంలో కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్ పట్టణాన్ని ఎంపిక చేశారు. దీనికి కారణం అప్పటికే కాకతీయ యూనివర్సిటీ కి అనుబంధంగా పీజీ కళాశాల భవనం ఉండటం, సుమారు 25 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఈ భవనంలో వసతులు, సౌకర్యాలకు కోదవలేకపోవడం సమీపంలో మరింత ప్రభుత్వ స్థలం ఉండటం వలన యూనివర్సిటీ ని ఏర్పాటు చేయవచ్చని భావించి మొదటి విడతగా 55 కోట్లు నిధులను కేటాయించారు. అప్పటి ప్రభుత్వ సిఫార్సుతో శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి పేరుతో సరస్వతి విశ్వవిద్యాలయం అని పేరును సైతం ప్రకటించా రు. కానీ ఆ సమయంలో రాష్ట్ర విభజన జరగడంతో యూనివర్సిటీ ఏర్పాటు ప్రతిపాదన అర్ధాంతరంగా నిలిచిపోయింది. సుమారు రెండు దశాబ్దాల పాటు నిర్మల్ కేంద్రంగా నడిచిన కాకతీయ యూనివర్సిటీ అనుబంధ ప్రభుత్వ పీజీ కాలేజీ సైతం ప్రస్తుతం మూతపడింది. దీంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న ఒకే ఒక పీజీ సెంటర్ కూడా మూతపడింది.హైదరాబాద్ జే.ఎన్.టీ.యూకు అనుబంధంగా ఆదిలాబాద్ జిల్లాలో ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు గత ప్రభుత్వం జీవో నంబర్ 67 ను విడుదల చేసింది. కళాశాల ఏర్పాటు అవుతుందన్న తరుణంలో స్థల సేకరణ జరగక అది మరుగున పడింది. నిర్మల్‌కు చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త నంగే శ్రీనివాస్ శ్రీ జ్ఞాన సరస్వతీ విశ్వవిద్యాలయ సాధన సమితిని ఏర్పాటు చేసి గత కొన్నేళ్లుగా సరస్వతీ విశ్వవిద్యాలయం పేరుతో యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన ఇప్పటికే పలుమార్లు ఉన్నత అధికారులను, కేంద్ర, రాష్ట్ర ప్రజా ప్రతినిధులను కలిసి యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకతను వివరించా రు. ఇటీవలే ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ప్రముఖ పత్రిక ఆధ్వ ర్యంలో యూనివర్సిటీ ఏర్పాటు ఆవశ్యకత పై విద్యార్థులు, విద్యావే త్తలు, మేధావులు, విద్యార్థి సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నేతలతో చర్చా వేదిక ను నిర్వహించింది. ఈ చర్చా వేదికలో పాల్గొన్న ప్రతి ఒక్కరు ముక్తకంఠంతో యూనివర్సిటీ ఏర్పాటు కావాల్సిందే అని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు గతంలో కేటాయించిన గిరిజన యూనివర్సిటీని ఎట్టి పరిస్థితిలో ఏర్పాటు చేయాలి, దీనికో సం గతంలో ఎన్నో ఉద్యమాలు చేపట్టాం. రానున్న రోజుల్లో సైతం ఉద్యమాలు చేపడతాం. ఇటీవల జరిగిన చర్చా వేదిక అనంతరం విద్యావేత్త, సామాజిక కార్యకర్త బద్దం పురుషోత్తం రెడ్డి సారథ్యంలో యూనివర్సిటీ సాధన జేఏసీ ని ఏర్పాటు చేసింది. వీరు త్వరలోనే తమ భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## భారత్ పర్యటనకు మెస్సీ..

# దిగ్గజ క్రికెటర్లతో మ్యాచ్ ఆడే అవకాశం

విశ్వంభర, స్పోర్ట్స్‌: అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్ లియోనిల్ మెస్సీభారత్ పర్యటనకు రానున్నాడు. టీమ్‌ఇండియా మాజీ, ప్రస్తుత స్టార్ క్రికెటర్లతో కలిసి క్రికెట్ మ్యాచ్ ఆడనున్నాడా? తాజాగా వస్తున్న వార్తలు నిజమేనంటున్నాయి. మెస్సీ షెడ్యూల్ ఖరారైనట్లు కథనాలు వస్తున్నాయి. డిసెంబర్ 13 నుంచి 15 వరకూ మెస్సీ భారత్‌లో పర్యటిస్తాడు. ముంబయి, దిల్లీ, కోల్‌కతాలో అభిమానులను కలుస్తాడని సమాచారం. ప్రమోషనల్ టూర్‌లో భాగంగా మెస్సీ రానున్నాడు. గత 14 ఏళ్లలో మెస్సీ భారత్‌కు రావడం ఇది రెండోసారి అవుతుంది. చివరిసారిగా 2011లో అర్జెంటీనా ఫుట్‌బాల్ వరల్డ్ కప్‌ను నెగ్గాక కోల్‌కతా వేదికగా జరిగిన ఓ ఈవెంట్‌లో మెస్సీ పాల్గొన్నాడు."డిసెంబర్ 14న మెస్సీ ముంబయికి రానున్నాడు. వాంఖడే స్టేడియంలో దిగ్గజ క్రికెటర్లతో మ్యాచ్ ఆడే అవకాశం ఉంది. ఆ రోజు గ్రౌండ్‌ను బ్లాక్ చేయాలని ఇప్పటికే ఎంసీఏను ఓ ఏజెన్సీ కోరింది. ఇటీవల జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమోదించింది. సచిన్, ధోనీ, రోహిత్, విరాట్.. ఇలా మాజీ, ప్రస్తుత క్రికెటర్లతో మెస్సీ మ్యాచ్ నిర్వహించేందుకు ఆర్గనైజర్లు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఒక్కసారి షెడ్యూల్ ఫైనల్ అయ్యాక ప్రకటన చేసే అవకాశం ఉంది" అని ముంబయి క్రికెట్ అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. కోల్‌కతాలో చిన్నారుల కోసం ఫుట్‌బాల్ వర్క్‌షాప్‌ను ఏర్పాటుచేయనున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో అతడి గౌరవార్థం GOAT CUP మ్యాచ్ నిర్వహిస్తారని సమాచారం.



**ఇక కేరళ పర్యటన కష్టమే..**

అర్జెంటీనా ఫుట్‌బాల్ జట్టు వచ్చే అక్టోబర్ లేదా నవంబర్‌లో కేరళకు వస్తుందని ఆ రాష్ట్ర మంత్రి అబ్దుల్ రహిమాన్ జూన్ 6న వెల్లడించారు. గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడతారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మద్దతుగా నిలిచింది. కానీ, ఇప్పుడు మెస్సీ డిసెంబర్‌లో భారత్‌కు వస్తాడని షెడ్యూల్ ఖరారయ్యే తుదిదశలో ఉన్నందున.. అంతకుముందు వచ్చే అవకాశం కష్టమే.

## స్క్వాడ్‌లో బుమ్రా ఉండాలంటే..

# టెస్టు సిరీస్ మొత్తం ఆడాల్సిందేనా?

విశ్వంభర, స్పోర్ట్స్‌: భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా గాయాలబారిన పడకుండా మేనేజ్‌మెంట్ చూసుకుంటోంది. ఇప్పుడు ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌లోనూ కేవలం మూడింట్లోనే ఆడించింది. వర్క్‌లోడ్ కారణంగా ఇబ్బందిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇలాంటి నిర్ణయం తీసుకుంది. అయితే, ఇతర పేసర్ల విషయంలోనూ ఇలానే వ్యవహరించాలనే డిమాండ్లూ లేకపోలేదు. అసలు అన్ని మ్యాచులు ఆడలేనప్పుడు అతడికి విశ్రాంతి ఇవ్వడమే మేలనే వాదనా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. బుమ్రా ఏదైనా సిరీస్‌లో అన్ని మ్యాచులను ఆడేలా ఉంటేనే స్క్వాడ్‌లోకి తీసుకొనే అవకాశం ఉందనేది వాటి సారాంశం."స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ కోచ్‌లు ఎప్పటికప్పుడు ప్లేయర్ల వర్క్‌లోడ్‌పై అధ్యయనం చేస్తూనే ఉంటారు. ఇక్కడ బుమ్రా విషయానికొస్తే మాత్రం అతడి ఫిట్‌నెస్ అత్యంత కీలకం. వైద్యబృందం పర్యవేక్షించిన తర్వాతనే తుది జట్టులో ఆడించడం జరుగుతుంది. అతడు అన్ని మ్యాచులు ఆడగలడని భావిస్తేనే ఏదైనా సిరీస్‌కు ఎంపిక చేసే ఆలోచనలో సెలక్షన్ కమిటీ ఉంది" అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

**అవన్నీ అవాస్తవాలే: టెన్ డస్కతే..**

టెస్టు సిరీస్‌లో ఏ మ్యాచ్ ఆడాలనేది బుమ్రా ఎంపిక చేసుకుంటాడనే విమర్శలపై భారత సహాయక కోచ్ రైన్ టెన్ డస్కతే స్పందించాడు. "బుమ్రాపై వస్తున్నవన్నీ తప్పుడు ఆరోపణలే. అతడిని అన్ని మ్యాచుల్లోనూ ఆడించాలని అనుకుంటాం. అతడి శరీరం సహకరించాల్సిన అవసరం ఉంది. దానికి గౌరవం ఇవ్వాలి. అందుకే, తుది జట్టులో బుమ్రాకు అవకాశం ఇవ్వడం లేదు. ఫలానా టెస్టులోనే ఆడతానని బుమ్రా



ఎప్పుడూ అనలేదు. ఇలాంటి కామెంట్లు రావడం బాధాకరం. మూడు టెస్టులు మాత్రమే ఆడతానని ముందే చెప్పాడు. అవేంటో మేనేజ్‌మెంట్‌నే నిర్ణయించమన్నాడు. పరిస్థితులకు అనుగుణంగా మేం నిర్ణయాలు తీసుకుంటాం" అని డస్కతే వెల్లడించాడు.

**అప్పట్నుంచే సమస్య మొదలు..**

గతేడాది టీ20 ప్రపంచకప్ ముందు వరకూ ఆరు నెలలపాటు వెన్ను నొప్పి కారణంగా ఆటకు దూరమయ్యాడు. జట్టులోకి వచ్చాక మూడు టెస్టుల సిరీస్‌లో ఆడినా ఎలాంటి ఇబ్బంది పడలేదు. అయితే, బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ (2024-25)లోని ఐదు టెస్టుల్లోనూ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. ఒకదశలో బౌలింగ్ చేయడం తనవల్ల కాదంటూ బుమ్రా చేసిన వ్యాఖ్యలు స్టంప్ మైక్స్‌లో వినిపించాయి. సిడ్నీ టెస్టులో గాయపడి మళ్లీ కొన్నాళ్లు ఆటకు దూరంగా ఉన్నాడు. దీంతో బుమ్రా విషయంలో ఎలాంటి రిస్క్ తీసుకోకూడదనే ఉద్దేశంతో మేనేజ్‌మెంట్ అతడికి రెస్ట్ ఇస్తూ కొన్ని మ్యాచుల్లోనే బరిలోకి దింపుతోంది.

# రోహిత్‌ది 'బలవంత' రిటైర్‌మెంటా?



విశ్వంభర, స్పోర్ట్స్‌: ఆస్ట్రేలియాతో జరిగిన బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని కోల్పోయాక టీమ్‌ఇండియాపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. అప్పటి కెప్టెన్ రోహిత్ శర్మను ఏకంగా ఆఖరి టెస్టులో ఆడించకుండా పక్కన పెట్టిన సంగతి తెలిసిందే. ఛాంపియన్స్ ట్రోఫీ ముగిసిన తర్వాత రోహిత్ శర్మ టెస్టులకు వీడ్కోలు పలికేశాడు. అతడితోపాటు విరాట్ కోహ్లీ కూడా షాకింగ్ నిర్ణయం తీసుకున్నాడు. అదే భారత క్రికెట్‌లో అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్‌తోపాటు మేనేజ్‌మెంట్ వల్లే ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని విమర్శలూ వచ్చాయి. వాటిపై తాజాగా మాజీ మేనేజర్ జయ్‌దేవ్ షా కీలక విషయాలను వెల్లడించారు. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీకి జయ్‌దేవ్ షా జట్టు మేనేజర్‌గా వ్యవహరించారు.

"ఆ టెస్టు సిరీస్‌కు ముందు రోహిత్‌శర్మకు బాబు పుట్టాడు. కొన్ని రోజులకే రోహిత్ గ్రౌండ్‌లోకి వచ్చినా పెద్దగా పరుగులు చేయలేదు. దీంతో అతడు అంతగా ఫామ్‌లో లేడని చివరి టెస్టు తుది జట్టు నుంచి తప్పించారు. కానీ, ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీలో జట్టును గెలిపించాడు. అప్పుడే అతడు టెస్టుల కంటే పరిమిత ఓవర్ల క్రికెట్‌నే ఎక్కువగా ఆడాలని నిర్ణయించుకున్నాడు. మేనేజ్‌మెంట్ కూడా కొత్త ఛాంపియన్‌షిప్ కోసం సిద్ధమవుతోంది. రెండేళ్ల సీజన్‌కు కొత్త ప్లేయర్లను రెడీ చేయడంపై దృష్టిపెట్టినట్లు అప్పటికే సంకేతాలు ఇచ్చింది. మరోవైపు రోహిత్‌శర్మ రెండేళ్లపాటు టెస్టు క్రికెట్‌లో కొనసాగడానికి సిద్ధంగా లేనట్లు కనిపించాడు. అతడికి గాయాల బెడద కూడా ఉంది. ఐపీఎల్‌లోనూ కొన్ని మ్యాచులు ఆడకపోవడం చూశాం. అందుకే, రోహిత్ ఇలాంటి కఠిన నిర్ణయం తీసుకొని ఉంటాడని అనుకుంటున్నా. కొత్తతరం కూడా కెప్టెన్సీతోపాటు జట్టు నుంచే వైదొలగాలని అనుకోవడం నిజంగా అద్భుతమే" అని జయ్‌దేవ్ వ్యాఖ్యానించారు. గత టీ20 ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు కూడా గుడ్‌బై చెప్పాడు. ప్రస్తుతం వన్డేల్లోనే కొనసాగుతున్న అతడు 2027 ప్రపంచకప్‌పై దృష్టిసారించాడు. అప్పటివరకూ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవాలని.. వన్డే ప్రపంచకప్‌ను నెగ్గి తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకాలనేదే అభిమానుల ఆకాంక్ష. అతడి సారథ్యంలో వరల్డ్ కప్ నెగ్గితే.. అప్పుడు ధోనీ సరసన చేరే అవకాశం ఉంది. ధోనీ నాయకత్వంలో టీమ్‌ఇండియా టీ20, వన్డే, ఛాంపియన్స్ ట్రోఫీలను సాధించిన సంగతి తెలిసిందే.

# రహానే, పుజారాలను పక్కనపెట్టిన సెలెక్టర్లు

విశ్వంభర, స్పోర్ట్స్ : ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే దేశవాళీ టోర్నీ దులీప్ ట్రోఫీలో భారత ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ వెస్ట్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా నియామకమయ్యాడు. శుక్రవారం వెస్ట్ జోన్ సెలెక్షన్ కమిటీ 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. ముంబై నుంచి ఏడుగురు ప్లేయర్లు, గుజరాత్ నుంచి నలుగురు, మహారాష్ట్ర, సౌరాష్ట్ర నుంచి ఇద్దరు చొప్పున ప్లేయర్లను ఎంపిక చేశారు. జైశ్వాల్ జైశ్వాల్, శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్, రుతురాజ్ గైక్వాడ్ వంటి స్టార్ ప్లేయర్లు జట్టులో ఉన్నారు. అయితే, సీనియర్ ఆటగాళ్లు అజింక్యా రహానే, చతేశ్వర్ పుజారాలకు స్థానం దక్కలేదు. ఈ నెల 28 నుంచి క్వార్టర్ ఫైనల్స్‌తో దులీప్ ట్రోఫీ ప్రారంభంకానుంది. వెస్ట్ జోన్ నేరుగా సెమీస్‌లోనే ఆడనుంది. ప్రస్తుతం శార్దూల్ ఠాకూర్ ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే.



## దేశంలో సగటున 30 శాతం పెరిగిన అద్దెలు



విశ్వంభర, బిజినెస్ బ్యూరో: ఈ ఏడాది రెండో త్రైమాసికంలో దేశవ్యాప్తంగా ఇంటి అద్దెలు భారీగా పెరిగాయని ఓ నివేదిక తెలిపింది. నిర్మాణంలో ఉన్న ఇళ్లు అందుబాటులో రావడంతో పాటు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువమంది ఇళ్లను అద్దెకు ఇచ్చేందుకు ఆసక్తి చూపించడం, యువతలో నిరుద్యోగం తగ్గడంతో అద్దె ధరల పెరుగుదలకు కారణమయ్యాయని ప్రముఖ కన్సల్టెంట్ సంస్థ మ్యాజిక్‌బ్రిక్స్ వెల్లడించింది. నివేదిక ప్రకారం, త్రైమాసిక పరంగా దేశంలో అద్దెలు 4.8 శాతం, గతేడాదితో పోలిస్తే 29.6 శాతం పెరిగాయి. స్థిరాస్తి రంగంలో డిమాండ్, సరఫరా కూడా 3 శాతం మేర పెరిగింది. అధికంగా గ్రేటర్ నోయిడాలో 20.7 శాతం మేర అద్దెలు పెరిగాయి. ఆ తర్వాత నవీ ముంబైలో 19.4 శాతం, ఢిల్లీలో 17.2 శాతం, కోల్‌కతాలో 13.7 శాతం, అహ్మదాబాద్‌లో 12.2 శాతం హైదరాబాద్‌లో 11.5 శాతం, చెన్నైలో 11.2 శాతం మేర పుంజుకున్నాయి. ఈ నగరాల్లో ప్రధానంగా సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లకు ఎక్కువ గిరాకీ ఉందని, సగటున 22 శాతం పెరిగింది. ఇదే సమయంలో 3 బెడ్‌రూమ్ ఇళ్లకు 25 శాతం మేర డిమాండ్ క్షీణించింది. దేశవ్యాప్తంగా 2 బెడ్‌రూమ్ ఇళ్లకు ఎక్కువమంది ప్రాధాన్యత ఇస్తున్నట్టు నివేదిక తెలిపింది. మొత్తం ఇళ్ల డిమాండ్‌లో 46 శాతం వాటా 2 బెడ్‌రూమ్‌లదే. అదేవిధంగా సెమీ-ఫర్నిష్‌డ్ ఇళ్లకు సగం కంటే ఎక్కువ గిరాకీ కొనసాగుతోంది. ఎక్కువమంది రూ. 10,000-20,000 మధ్య ఉండే ఇళ్ల కోసమే చూస్తున్నారు.

## జులై జీఎస్టీ వసూళ్లు రూ.1.96 లక్షల కోట్లు

విశ్వంభర, బిజినెస్‌: వస్తు, సేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. జులై నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గతేడాదితో పోలిస్తే ఈసారి 7.5 శాతం వృద్ధి నమోదైంది. ఈ మేరకు జులై నెలకు సంబంధించిన జీఎస్టీ గణాంకాలను కేంద్రం శుక్రవారం విడుదల చేసింది. గతేడాది జులైలో జీఎస్టీ రూపంలో రూ.1.82 లక్షల కోట్లు వసూలైంది. జీఎస్టీ వసూళు గత కొన్ని నెలలుగా రూ.1.8 లక్షల కోట్లు పైన స్థిరంగా నమోదవుతూ వస్తున్నాయి. ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం ఇది వరుసగా ఏడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.2.37 లక్షల కోట్లు వసూళ్లు సాధించగా.. జూన్‌లో రూ.1.85 లక్షల కోట్లు వసూళ్లు నమోదయ్యాయి.

# అనిల్ అంబానీపై లుకౌట్ నోటీసులు

విశ్వంభర, బిజినెస్‌: అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. రూ.17 వేల కోట్ల మేర రుణ మోసాలకు సంబంధించిన కేసులో ఆయనపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. విచారణ సమయంలో దేశం విడిచిపోకుండా ఉండేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విజ్ఞప్తి మేరకు ఈ లుకౌట్ సర్క్యులర్ జారీ అయ్యింది. ఈ కేసులో ఆగస్టు 17న విచారణకు హాజరు కావాలని ఈడీ ఇప్పటికే అనిల్ అంబానీకి సమన్లు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఆయన స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నట్లు అధికారిక వర్గాలు శుక్రవారం వెల్లడించాయి.రుణ మోసానికి సంబంధించిన కేసులో గతవారం అనిల్ అంబానీకి చెందిన పలు కార్యాలయాల్లో మూడు రోజుల పాటు ఈడీ సోదాలు (ED Raids) నిర్వహించిన సంగతి తెలిసిందే. 50 కంపెనీలు, 25 మంది వ్యక్తులకు చెందిన ముంబయిలోని 35 ప్రాంగణాల్లో తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో పలు కీలక దస్త్రాలను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే తాజాగా ఆయనకు ఈడీ సమన్లు, లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 2017-19 మధ్య అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలకు యెస్ బ్యాంక్ ఇచ్చిన రూ.3,000 కోట్ల రుణాలు చట్టవ్యతిరేక పద్ధతుల్లో దారిమళ్లాయన్న ఆరోపణలు వచ్చాయి. ఆ బ్యాంక్ మాజీ ప్రమోటర్లకు లంచం ఇచ్చారన్న అభియోగాలు ఉన్నాయి. రిలయన్స్




ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ తీసుకున్న రూ.10వేల కోట్ల రుణాలను కూడా దారి మళ్లించారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇవి కాకుండా ఆర్‌కామ్-కెనరా బ్యాంకుల మధ్య రూ.1,050 కోట్ల రుణం విషయంలోనూ మోసాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో పాటు ఏటీ-1 బాండ్లలో (బ్యాంకులు జారీ చేసే అడిషినల్ టైర్-1 బాండ్లు) రిలయన్స్ మ్యూచువల్ ఫండ్ రూ.2,850 కోట్ల మేర పెట్టుబడులు పెట్టిందని, ఇందులో క్విడ్ ప్రోకోకు పాల్పడిందనే ఆరోపణలు వినిపించాయి. ఇలా అనిల్ అంబానీకి చెందిన కంపెనీలు దాదాపు రూ.17 వేల కోట్ల మేర బ్యాంకు రుణాల మోసాలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

# టారిఫ్‌లతో.. అమెరికా కుటుంబాలపై ఏటా రూ.2 లక్షల భారం!

విశ్వంభర, బిజినెస్‌: భారత్ సహా ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ సుంకాలు, జరిమానాలు విధిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా ప్రజలపైనే ఇవి గణనీయంగా ప్రభావం చూపుతాయని తాజా నివేదిక వెల్లడించింది. కొత్త సుంకాలతో ద్రవ్యోల్బణం పెరగడం వల్ల కుటుంబాల వార్షిక సగటు ఖర్చు 2400 డాలర్లు (రూ.2లక్షలు) మేర పెరగనున్నట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదిక అంచనా వేసింది.సుంకాల ప్రభావంతో ఆర్థిక భారం అనేది ఆయా ఆదాయ వర్గాలపై భిన్నంగా ఉంటుందని ఎస్‌బీఐ నివేదిక వెల్లడించింది. అల్ప ఆదాయ కుటుంబాలపై 1300 డాలర్ల భారం పడనుండగా.. అధిక ఆదాయ కుటుంబాలు 5 వేల డాలర్లు అదనంగా ఖర్చు చేయాల్సిరావొచ్చని అంచనా వేసింది. స్వల్పకాలంలో సగటున 2400 డాలర్లు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ దీర్ఘకాలంలో ఈ ప్రభావం తక్కువగానే ఉండవచ్చని తెలిపింది.ఈ వాణిజ్య వివాదంతో భారత్ కన్నా అమెరికా ఆర్థిక వ్యవస్థకే ఎక్కువ నష్టం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ నివేదిక అంచనా వేసింది. సుంకాల కారణంగా ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, తదితర రంగాల్లో దిగుమతి వస్తువుల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉండటంతో.. ఇప్పటికే పెరుగుతోన్న ద్రవ్యోల్బణంపై ఇవి మరింత ప్రభావం చూపనున్నట్లు పేర్కొంది. ఖర్చులు పెరగడం, డిమాండు తగ్గడం ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని, తద్వారా అమెరికా జీడీపీ వృద్ధి 40 నుంచి 50 బేసిస్ పాయింట్లు తగ్గే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది.సుంకాల పెరుగుదలతో ఇరు దేశాలు సవాళ్లను ఎదుర్కొంటాయని ఎస్‌బీఐ రీసెర్చ్ తన నివేదికలో పేర్కొంది. అయినప్పటికీ డాలర్ క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం, కనిష్ఠ జీడీపీ వృద్ధి అంచనాలతో భారత్ కంటే అమెరికాను ఇవి మరింత బలహీన స్థితిలోకి నెట్టేస్తాయని, భారత్ మాత్రం అంతర్జాతీయ



ఒడుదొడుకులను ఎదుర్కొనే సన్నద్ధతతోనే ఉందని అభిప్రాయపడింది. భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసుకునే అన్ని వస్తువులపై విధించిన 25 శాతం సుంకాలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే, ఈ సుంకాల ప్రభావాన్ని అంచనా వేస్తున్నామని, జాతీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని భారత ప్రభుత్వం చెబుతోంది. అమెరికాతో చర్చలు కొనసాగుతున్నాయని, ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తామని ధీమా వ్యక్తం చేసింది.

## భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు.. రూ.6 లక్షల కోట్లు ఆవిరి



విశ్వంభర, ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారాంతాన్ని నష్టాలతో ముగించాయి. భారత్‌పై 25 శాతం సుంకం విధించడంతోపాటు ఇతర వాణిజ్య భాగస్వాములపైనా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్‌లు విధించడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మరోవైపు విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతుండడం, బలహీన త్రైమాసికాలు వంటివి సూచీలపై ప్రభావం చూపాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్కరోజులోనే దాదాపు రూ.6 లక్షల కోట్లు ఆవిరై రూ.444 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 81,074.41 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 81,185.58) వద్ద స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభాల్లోకి వెళ్లినప్పటికీ ఎంతోసేపు నిలవలేదు. ఆపై సూచీ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. చివరికి 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 203 పాయింట్ల నష్టంతో 24,565.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.53గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, టాటా స్టీల్, మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.49 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3346 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### రూపాయికే బీఎస్‌ఎన్‌ఎల్ ప్లాన్.. ఫ్రీడమ్ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చిన సంస్థ

న్యూఢిల్లీ, ఆగస్టు 1: ప్రభుత్వరంగ టెలికాం సంస్థ బీఎస్‌ఎన్ఎల్ సరికొత్త ప్లాన్‌ను ఆవిష్కరించింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సంస్థ నెల రోజుల కాలపరిమితితో రూ.1 ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇటీవల దేశవ్యాప్తంగా 4జీ సేవలను ప్రారంభించిన సంస్థ..కొత్త కస్టమర్లను ఆకట్టుకోవడానికి ఈ నూతన ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.ఈ ప్లాన్‌లో అన్ లిమిటెడ్ వాయిస్ కాల్స్‌తోపాటు ప్రతీ రోజు 2 జీబీ హై-స్పీడ్ డాటా, రోజుకు 100 ఎస్ఎంఎస్ పంపుకోవచ్చునని బీఎస్ఎన్ఎల్ సీఎండీ ఏ రాబర్ట్ జే రవి తెలిపారు. 'ఆత్మనిర్భర్ భారత్' మిషన్‌లో భాగంగా ప్రతీ ఒక్కరికి 4జీ సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ నూతన ప్లాన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు, దీంట్లోభాగంగా ఉచితంగా సిమ్‌ను కూడా అందిస్తున్నట్టు చెప్పారు. ఇతర పోటీ సంస్థలైన జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు రూ.349, రూ.379, రూ.399 చొప్పున ప్లాన్లను అందిస్తున్నాయి.

# విశ్వంభర సెట్స్‌లో చిరంజీవితో మౌనీ రాయ్..





మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'విశ్వంభర' షూటింగ్ చివరి దశకు చేరింది. 'వాల్తేరు వీరయ్య', 'భోళా శంకర్' తర్వాత చిరంజీవి నుంచి వస్తున్న ఈ భారీ ఫాంటసీ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో, ముఖ్యంగా మెగా ఫ్యాన్స్‌లో భారీ స్థాయిలో అంచనాలు ఉన్నాయి. వింటేజ్ చిరు మేజిక్‌ను మళ్లీ వెండితెరపై చూపించే ప్రయత్నంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు.'బింబిసార' వంటి బ్లాక్‌బస్టర్ ఇచ్చిన దర్శకుడు మల్లిడి వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 14 లోకాల్లో హీరోయిన్ కోసం హీరో చేసే యాత్రే ఈ కథ యొక్క కేంద్ర బిందువుగా తెలుస్తుంది. విశ్వంభర చిత్ర కథకు ప్రేరణగా 'జగదేక వీరుడు అతిలోక సుందరి', 'పాతాళ భైరవి', 'కీలు గుర్రం'చిత్రాలు నిలిచాయి. భారీ విజువల్స్, గ్రాఫిక్స్‌తో ఫుల్ స్కేల్ ఫాంటసీ మూవీగా రూపుదిద్దుకుంటోంది. ఈ చిత్రంలో చిరంజీవికి జోడిగా సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ నటిస్తుంది. చాలా కాలం తర్వాత చిరుతో త్రిష కలిసి పనిచేయడం అభిమానుల కు ఇది మంచి సర్‌ప్రైజ్ కావొచ్చు. ఇక సినిమా స్పెషల్ ఎలిమెంట్‌గా బాలీవుడ్ బ్యూటీ మౌనీ రాయ్ పర్ఫార్మ్ చేయబోయే స్పెషల్ సాంగ్ కానుంది. ఈ పాట చిరంజీవి ఐకానిక్ సినిమా గ్యాంగ్ లీడర్‌లోని ఎవర్‌గ్రీన్ మాస్ సాంగ్ 'రగులుతోంది మొగలిపొద' కు రీమిక్స్ అని తెలుస్తోంది. మౌనీ రాయ్ 'నాగినీ' సీరియల్, 'బ్రహ్మాస్త్ర' వంటి ప్రాజెక్టుల వల్ల ఇప్పటికే మంచి ఫేమ్ సంపాదించగా, ఈ పాటతో టాలీవుడ్‌లో తన క్రేజ్ మరింత పెరుగుతుందన్నదాంట్లో సందేహం లేదు. తాజాగా విశ్వంభర సెట్‌లో చిరంజీవితో కలిసి మౌనీ రాయ్ దిగిన పిక్ ఒకటి బయటకు వచ్చింది. ఈ పిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అయింది. ఈ పిక్‌తో విశ్వంభర చిత్రంలో మౌనీరాయ్ స్పెషల్ సాంగ్ చేస్తుందనే దానిపై ఫుల్ క్లారిటీ వచ్చింది. 'విశ్వంభర' చిత్రాన్ని UV క్రియేషన్స్ పతాకంపై వంశీ కృష్ణా రెడ్డి, ప్రమోద్ ఉప్పలపాటి, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా బడ్జెట్ రూ. 200 కోట్లకు పైగా వెచ్చించినట్టు సమాచారం. విజువల్ ఎఫెక్ట్స్, స్టార్ కాస్ట్, ప్రొడక్షన్ విలువలు అన్ని కూడా ఆకట్టుకునేలా ఉంటాయట. ఈ చిత్రంలో ఆషికా రంగనాథన్, ఇషా చావ్లా కూడా ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండటంతో మ్యూజికల్‌గా కూడా సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. సెప్టెంబర్‌లో మూవీ విడుదలయ్యే అవకాశం ఉంది.

# మినీ స్కర్ట్‌లో అషు గ్లామర్ బ్లాస్ట్



టాలీవుడ్ గ్లామర్ వరల్డ్‌లో అడుగుపెట్టిన తర్వాత అషు రెడ్డి స్టైల్, స్వాగ్‌కి ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పడింది. బిగ్ బాస్ షోలో తన ఉత్సాహభరితమైన బాడీ లాంగ్వేజ్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ, తాజాగా తన గ్లామరస్ లుక్స్ తో మరోసారి నెట్టింట తెగ దూసుకుపోతోంది. షేర్ చేసిన ఫోటోషూట్‌లో అషు రెడ్డి రెడ్ కలర్ ఫ్లోరల్ టాప్, బ్లాక్ మినీ స్కర్ట్‌లో స్టన్నింగ్‌గా మెరిసిపోయింది. ఈ లుక్‌లో ఆమె వేషధారణ మాత్రమే కాదు, హైహీల్స్, హెయిర్ ఫ్లిప్, ఎక్స్‌ప్రెషన్లు అన్నీ కలసి ఒక స్టైలిష్ స్టేట్మెంట్ లా మారాయి. "నా హీల్స్ నిన్ను ఎత్తుగా చేస్తాయని నాకు తెలుసు. అనే క్యాప్షన్‌తో ఆమె పోస్ట్‌కి యూత్ నుంచి రెస్పాన్స్ జెట్ స్పీడ్‌లో వచ్చింది. వేలల్లో లైకులు, ఆకట్టుకునే కామెంట్లతో ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ లుక్ చూస్తే క్లాస్‌కు గ్లామర్ ఎలా జోడించాలో అషుతో నేర్చుకోవాలి అంటున్నారు నెటిజన్స్. ఇక అషు కెరీర్ విషయానికొస్తే, సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ బ్యూటీ, డబ్‌స్మాష్‌తో మొదలైన ప్రయాణం టీవీ నుంచి సినిమాల వరకు విస్తరించింది. బిగ్ బాస్ సీజన్ 3 ఆమెకు మంచి గుర్తింపు తీసుకువచ్చింది. ఆ షో ద్వారా ఆమె మాస్ ఆడియెన్స్‌లో తన ప్రత్యేకతను చూపించింది. ఆ తర్వాత కొన్ని స్పెషల్ షోలు, ఈవెంట్ హోస్టింగ్, గ్లామర్ ఫోటోషూట్లతో తనదైన గుర్తింపును క్రియేట్ చేసుకుంది. అషు రెడ్డి స్పష్టంగా తెలుసుకొని ప్రయాణిస్తున్న విషయమేమిటంటే గ్లామర్ ద్వారా క్రేజ్ తెచ్చుకుంటే దానిని మెయింటైన్ చేయడమే అసలైన ఆర్ట్. ఆమె ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్ చూస్తేనే తెలుస్తుంది.. ప్రతీ ఫోటోలో ఓ థీమ్ ఉంటుంది, ఒక ఫీల్ ఉంటుంది. ముఖ్యంగా స్టైలింగ్, మేకప్, పోజింగ్, డ్రెస్సింగ్ డిజైన్ అన్నిటిలోనూ ఎంతో కేర్ తీసుకుంటుంది. మొత్తానికి, అషు రెడ్డి ఈ తాజా గ్లామర్ ఫోటోషూట్‌తో మరోసారి తన స్థాయిని నిరూపించుకుంది.

# సినిమా



# నేను వారితో కలవడం మా ఆయనకి నచ్చదు



అందాల ముద్దుగుమ్మ అనసూయ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. యాంకర్‌గా, నటిగా అశేష ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఇక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉండే అనసూయ గ్లామరస్ ఫోటోలు షేర్ చేస్తూ కుర్రాళ్లకి కంటిపై కునుకు లేకుండా చేస్తుంటుంది. ఇక ఇంటర్వ్యూలలో ఆమె ఏ విషయంపైనైన చాలా ఓపెన్‌గా మాట్లాడుతుంది. తాజాగా తన భర్తకి సంబంధించిన కొన్ని విషయాలు చెప్పుకొచ్చి అందరిని ఆశ్చర్యపరిచింది మా ఆయన పర్‌ఫెక్ట్ అని అందరు అనుకుంటారు. కాని ఆయన కూడా అందరి మగాళ్లలాగే . మా ఇద్దరి మధ్య కూడా కొన్ని సందర్భాలలో గొడవలు అయ్యాయి. నేను వెళ్లి కొంతమందిని కలవడం. కొంతమందితో సినిమాలు చేయడం ఆయనకి నచ్చలేదు. ఆ సమయంలో చాలా ఇబ్బందులు పడుతూ గొడవలు పడ్డ సందర్భాలు కూడా ఉన్నాయి. నేను హీరోలతో.. పెద్ద పెద్ద స్టార్‌లతో.. గుడ్ లుకింగ్ పీపుల్స్‌తో ఇంట్రాక్ట్ అయినప్పుడు చాలా ఇబ్బంది పడేవారు. అబ్బాయిల మనస్తత్వమే అది. నన్ను ఫ్లర్ట్ చేయడం కావచ్చు.. కాంప్లిమెంట్ కావచ్చు.. ఆయన తీసుకోలేరు. సాధారణంగా అందరు కూడా అనసూయ భర్త అన్నీ చేయనిస్తాడు, అన్నింటికి ఒప్పుకుంటాడు అని అందరు అనుకోవచ్చు. వాడు చేతకాని వాడు అని కూడా అంటారు. అదృష్టం ఏంటంటే మా ఆయనకి తెలుగు రాదు. సోషల్ మీడియాలో కామెంట్స్ పట్టించుకోడు. ఆయనలా ఉండాలని ఎన్నోసార్లు అనుకుంటాను. నేను మా ఆయనతో ఉన్నట్టు వేరే వాళ్లతో ఉండలేను. నాకు వేరే వ్యక్తి బ్యాడ్‌గా అనిపిస్తే.. నేను అతనికి బ్యాడ్‌గా కనిపిస్తా. అది హ్యూమన్ బిహేవియర్ అంతే. నేను కూడా మా ఆయనతో ఇన్‌సెక్యూరీగా ఫీల్ అయిన సందర్భాలు ఉన్నాయి. అనసూయకి అసూయ అనేది వాళ్ల ఆయన దగ్గర మాత్రమే ఉంటుంది. ఇంకెక్కడా ఉండదు. నేను మోస్ట్ సెక్యూర్డ్ పర్సన్‌ని. ఆయన కూడా అలాగే ఫీల్ అవుతారు అని అనసూయ పేర్కొంది. ఇక మన అన్నతో మనకి విడాకులు ఉండవు. అమ్మతో విడాకులు ఉండవు.. అక్కతో ఉండవు. కానీ కేవలం భార్యతోనే ఉంటుంది. పెళ్లి అనే దానికి మన భారతీయ సాంప్రదాయంలో ఇచ్చేటంత గౌరవం మరెక్కడ కూడా ఇవ్వరు. అయితే ఈ మధ్య విడాకుల వలన విలువలు తగ్గించుకుంటున్నారు. ఓపిక,అడ్జెస్ట్‌మెంట్ వల్లనే బంధాలు నిలబడతాయి. ఈ జనరేషన్ వారికి అంత ఓపిక లేదని అనసూయ పేర్కొంది.

# మరోసారి గొప్ప మనసు చాటుకున్న సోనూసూద్

**నిన్న 52వ బర్త్‌డే సందర్భంగా సోనూసూద్ కీలక నిర్ణయం**
**వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన నటుడు**
**500 మంది వృద్ధులకు ఇందులో ఆశ్రయం కల్పించనున్నట్లు వెల్లడి**



నటుడు సోనూసూద్ మరోసారి గొప్ప మనసుచాటుకున్నారు. నిన్న తన 52వ పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మరోగొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 500మంది వృద్ధులకు ఇందులో ఆశ్రయం కల్పించనున్నట్లు తెలిపారు. ఎవరూ లేని వృద్ధులకు సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించేందుకు ఈ ప్రయత్నమని ఆయన పేర్కొన్నారు. ఇందులో వృద్ధులకు ఆశ్రయం ఇవ్వడంతో పాటు వైద్య సంరక్షణ, పోషకాహారం కూడా అందించనున్నట్లు తెలిపారు. దీంతో ఈ రియల్ హీరోపై మరోసారి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, సోనూసూద్ మహమ్మారి కరోనా సమయంలో దేశంలో ఏ కష్టం వచ్చినా వెంటనే స్పందించి రియల్ హీరో అనిపించుకున్న విషయం తెలిసిందే. ఎంతోమంది సాయం చేసి ఆదుకున్నారాయన.

# మయసభ ట్రైలర్.. స్నేహితులు, రాజకీయ ప్రత్యర్ధులుగా మారితే..




ప్రేక్షకులకు విభిన్నమైన కంటెంట్‌ను అందించడంలో ముందున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్ సోనీ లివ్. ఇప్పుడు రాజకీయ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ 'మయ సభ' ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. "రైజ్ ఆఫ్ ది టైటాన్స్" అనేది ఈ సిరీస్ ట్యాగ్ లైన్. సీనియర్ దర్శకుడు దేవా కట్టా దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ ఆగస్టు 7 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ వెబ్ సిరీస్‌కి నిర్మాతలుగా విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష వ్యవహరించగా, హిట్ మ్యాన్, ఫ్రూడోస్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పి బ్యానర్‌పై తెరకెక్కింది. ముఖ్య పాత్రల్లో ఆది పినిశెట్టి, చైతన్య రావు, దివ్య దత్తా, సాయికుమార్, శత్రూ, శ్రీకాంత్ అయ్యంగార్, తన్య రామచంద్రన్, రవీంద్ర విజయ్ తదితరులు నటించారు. ఈ కథకు ప్రేరణగా ఏపీ రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన నేతలు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మధ్య ఉన్న స్నేహం, అనంతరం వారిద్దరి మధ్య ఏర్పడిన రాజకీయ విరోధతను తీసుకున్నట్టు దేవా కట్టా తెలిపారు. అయితే ఇది పూర్తిగా కల్పితమైన కథేనని, కొన్ని సంఘటనలు మాత్రం కాల్పనికంగా మలిచామని ఆయన స్పష్టం చేశారు. ఒకే లక్ష్యంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఇద్దరు స్నేహితులు, తర్వాత దారి మార్చుకొని విడిపోయిన సందర్భాలను బలంగా చూపించనున్నట్టు చెప్పారు.తాజాగా విడుదలైన ట్రైలర్ పలు సంచలనాత్మక డైలాగ్‌లతో సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. ఇద్దరు స్నేహితులు రాజకీయ ప్రత్యర్ధులుగా ఎలా మారారన్న పాయింట్‌తో ఈ వెబ్ సిరీస్‌ని రూపొందించారు. ట్రైలర్‌లోని సన్నివేశాలు, డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. జీవితంలో ఏదో సాధించాలి, ప్రజలకు అండగా నిలబడాలనే లక్ష్యంతో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఇద్దరు స్నేహితుల ప్రయాణం ఎలా సాగింది? కలిసి తిరిగిన వారు రాజకీయ గమనంలో ప్రత్యర్ధులుగా మారడానికి కారణాలు ఏంటి? ఇద్దరి గొప్ప స్నేహితుల మధ్య ఉండే స్నేహం, మానసిక సంఘర్షణ.. పొలిటికల్ జర్నీలో వారు ఎదుర్కొన్న పరిస్థితులను భావోద్వేగంగా మయసభ వెబ్ సిరీస్‌లో ఆవిష్కరించనున్నట్టు తెలుస్తుంది.




Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com